


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 6 సంచిక: 19, పేజీలు - 08
మంగళవారం, జులై 14, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# తెలంగాణలో ముందస్తు మైండ్ గేమ్!

- కేటీఆర్ 78 సీట్ల వెనుక అసలు వ్యూహం
- రేవంత్ రెడ్డి 117 సీట్ల కౌంటర్!
- ఎవరి లెక్క నిజం.?




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాలు ఎప్పుడూ ముందస్తు వ్యూహాలు, మైండ్ గేమ్‌లతో హీటెక్కుతుంటాయి. వచ్చే సాధారణ ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ అగ్రనాయకత్వం అప్పుడే సీట్ల లెక్కలపై సవాల్-ప్రతిసవాళ్లకు దిగాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్‌కు 78 సీట్లు వస్తాయి, స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి చేయించుకున్న ఇంటెన్సివ్ సర్వేలోనే ఈ విషయం తేలింది అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బాంబు పేల్చారు. దీనికి కౌంటర్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం రైతు ఆశీర్వాద సభ సాక్షిగా హాట్ కామెంట్స్ చేశారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 2029 మే లేదా జూన్‌లో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏకంగా 117 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుని తీరుతుందని, కావాలంటే రాసి పెట్టుకోమంటూ సవాల్ విసిరారు. ఈ ఇద్దరు నేతల ప్రకటనల వెనుక లోతైన రాజకీయ వ్యూహాలు, క్యాడర్‌లో భరోసా నింపే ప్రయత్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

### కుంగుతున్న క్యాడర్‌లో జోష్ కోసమేనా.?

వరుసగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పరాజయం పాలవడం కీలక నేతలు పార్టీ వీడిపోతుండటంతో బీఆర్ఎస్ కేడర్ కొంత కన్‌ఫ్యూజన్‌లో పడింది. ఇలాంటి తరుణంలో పార్టీ శ్రేణులకు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు ధైర్యం కల్పించడం కేటీఆర్‌కు అత్యంత అవసరం. అందుకే, కాంగ్రెస్ ప్రభుత్వం సగం పదవీకాలం ముగిసేసరికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ఇంటెలిజెన్స్ వర్గాలు, ప్రభుత్వ అంతర్గత సర్వేల ప్రకారం ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే బీఆర్ఎస్ 78 సీట్లతో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ ప్రకటించారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారనే వాతావరణాన్ని సృష్టించడం ద్వారా పార్టీ ఫిరాయింపులకు బ్రేక్ వేయడంతో పాటు క్షేత్రస్థాయి క్యాడర్‌లో సరికొత్త ఉత్సాహాన్ని నింపాలనేది కేటీఆర్ ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.

2లో..

## బద్రీనాథ్ విరాళాల దుర్వినియోగం కేసు

### - 32 రోజుల సీసీటీవీ ఫుటేజీ మిస్సింగ్



డెహ్రాడూన్ (ప్రశ్న న్యూస్) శ్రీ బద్రీనాథ్ ధామ్‌లో భక్తుల విరాళాల దుర్వినియోగం కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అత్యంత ముఖ్యమైన ఆధారంగా భావిస్తున్న 32 రోజుల సీసీటీవీ ఫుటేజీ కనిపించకుండా పోయినట్లు వెల్లడైంది. తొలుత 45 రోజుల వీడియో రికార్డింగ్‌ను భద్రపరిచినట్లు అధికారులు తెలిపినా.. దర్యాప్తు బృందానికి అందులో 32 రోజుల ఫుటేజీ అందలేదని సమాచారం. ప్రస్తుతం

2లో..

## 36 ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

### - పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన సీఎం చంద్రబాబు




**అమరావతి (ప్రశ్న న్యూస్)** సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, సోమవారం ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టులో కీలకమైన ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యామ్‌లోని గ్యాప్ 1, గ్యాప్ 2తో పాటు పవర్ హౌస్ నిర్మాణ పనులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం, ప్రాజెక్టు ప్రదేశం నుంచే రాష్ట్రంలోని 36 ప్రాధాన్యతా సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ వర్చువల్ సమీక్షలో వివిధ జిల్లాల కలెక్టర్లు, ఆర్థిక శాఖ అధికారులు పాల్గొన్నారు. రాబోయే

2లో..

## తెలంగాణ విశాల ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయాలి

### - ఎంపీలకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ విశాల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులకు సూచించారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా

2లో..

## ధవళేశ్వరం బ్యారేజీకి కొత్త కళ

### - గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత అన్న సీఎం చంద్రబాబు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీంట్లో భాగంగానే సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్ కు కొత్త గేట్లను అమరుస్తున్నట్టు చెప్పారు. ధవళేశ్వరం బ్యారేజీకి రూ.152.95 కోట్ల వ్యయంతో 117 కొత్త గేట్లను అమర్చే పనులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ మేరకు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు గేట్లను అమర్చే పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందని సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని అధికారులు వివరించారు.



2లో..

## తెలంగాణకు తాగునీటి ముప్పు

### అడుగంటుతున్న భూగర్భజలాలు, డ్యామ్‌లు



- ఉత్తర తెలంగాణలో పరిస్థితి మరింత ఆందోళనకరం
- ప్రమాదకరంగా జలాశయాలలో నీటిస్థాయిలు
- 9.46 మీటర్ల లోతుకు పడిపోయిన భూగర్భ జలమట్టం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో తాగునీటి పరిస్థితి రోజురోజుకూ తీవ్ర ఆందోళనకరంగా మారుతోంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడం ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటిపోవడంతో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. భూగర్భ జలమట్టాలు కూడా క్రమంగా పడిపోతుండటంతో రానున్న నెలల్లో తాగునీటి సరఫరాపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మిషన్ భగీరథ పథకం కింద గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు అందించే 123 శుద్ధి కేంద్రాలకు రాష్ట్రంలోని 29 ప్రధాన జలాశయాలు ఆధారంగా ఉన్నాయి. ఈ 29 జలాశయాల మొత్తం నిల్వ సామర్థ్యం 1,059 టీఎంసీలు కాగా ప్రస్తుతం కేవలం 333.44 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. గతేడాది ఇదే సమయంలో 522.31 టీఎంసీల నిల్వలు ఉండగా గతంతో పోలిస్తే ఈసారి పరిస్థితి మరింత దిగజారినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక ఉత్తర తెలంగాణలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో

2లో..

## ఆరుగురిని చంపిన రాజ్‌కుమార్ ఆత్మహత్య

### - మృతదేహం రికవరీ చేసుకున్న పోలీసులు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం రేపిన షాబాద్ ఆరు హత్యల కేసుల్లో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్, సూసైడ్ చేసుకున్నాడు. తన మేనమామ ఊరు అయిన కొత్తూరులోని ఓ వెంచర్ వద్ద రాజ్‌కుమార్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా రంగంలోకి దిగిన అధికారులు అక్కడ పరిశీలన చేశారు. ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యవహారంలో రాజ్‌కుమార్ పోక్సో కేసులో అరెస్ట్ అయి జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటికి వచ్చాడు. ఈ ఘటనతో కోపం పెంచుకున్న రాజ్‌కుమార్ బాధిత బాలికతోపాటు తల్లి, నానమ్మను, తన భార్య, ఇద్దరు పిల్లలను కలిపి మొత్తం ఆరుగురిని ఒకే రాత్రిలో అతి కిరాతకంగా హతమార్చాడు.

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం పంజర్ల గ్రామ శివారు ప్రాంతంలో ఒక వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు డయల్ 100 ద్వారా సమాచారం ఇచ్చారు. స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు అక్కడికి చేరుకుని మృతుడిని గుర్తించారు. షాబాద్ ఆరు హత్యల కేసులో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్ అని గుర్తించారు. రాజ్‌కుమార్ మృతదేహం పక్కనే విషం బాటిల్ లభ్యం కావడంతో అతడు పాయిజన్ తాగి చనిపోయినట్లు ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆరుగురిని చంపేయడంతో తనను పట్టుకునేందుకు పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా జల్లెడ పడుతుండటంతో తీవ్ర భయాందోళనలకు గురై ఎటూ తప్పించుకుని పోయే అవకాశం లేకపోవడంతో

2లో..

## ఏపీ, తెలంగాణ జల జగడం

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ పిటిషన్
- పోలవరం, కృష్ణా జలాలు, బనకచర్ల అంశాలపై దాఖలైన వ్యాజ్యం
- పిటిషన్‌లో తీవ్ర సాంకేతిక లోపాలున్నాయన్న ధర్మాసనం
- తెలంగాణకు నో చెప్పిన సుప్రీం కోర్టు




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) గోదావరి జలాల వినియోగంతోపాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, బనకచర్ల లింక్ ప్రాజెక్టు వంటి అంశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై తాజాగా సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వానికి ఉపశమనం లభించలేదు. తెలంగాణ సర్కార్ దాఖలు చేసిన పిటిషన్‌లో సాంకేతిక లోపాలను

2లో..

## 'సింగరేణి భరోసా యాత్ర' ప్రారంభించిన బీజేపీ

### - హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రారంభం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్-సీసీఎల్)కు కేంద్ర ప్రభుత్వం తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయించిన నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తెలంగాణ బీజేపీ సోమవారం 'సింగరేణి భరోసా యాత్ర'ను ప్రారంభించింది. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తదితర నేతలు ఈ రెండు రోజుల యాత్రకు శ్రీకారం చుట్టారు.

2లో..

## రోడ్డుపై 500 ఓటర్ కార్డులు!

### - జల్‌పల్లి ఓ బ్యాగులో వదిలివేసిన వైనం



2లో..

## బోనాల జాతరకు సర్వం సిద్ధం

### - భక్తులకు కట్టుదిట్టమైన భద్రత

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు భాగ్యనగరం మొత్తం బోనాల శోభతో పులకించిపోతుంది. హైదరాబాద్ లో ఎటు చూసినా సందడే సందడి వాతావరణం నెలకొని ఉంటుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాల



2లో..

# తెలంగాణలో ముందస్తు మైండ్ గేమ్!

## రేవంత్ 117 సీట్ల లెక్క - అసంతృప్తిని నొక్కేసే ముందస్తు వ్యూహం!

మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అంతే వ్యూహాత్మకంగా వ్యవహరించారు. భవిష్యత్తులో నియోజకవర్గాల సంఖ్య 119 నుండి 182కి పెరుగుతుందని అంచనా వేస్తూ అందులో కాంగ్రెస్ 117 సీట్లు క్లీన్ స్వీప్ చేస్తుందని జోస్యం చెప్పారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఫేక్ సర్వేల ప్రచారాన్ని తిప్పికొట్టడానికి ఆయన ఈ మైండ్ గేమ్‌ను ఎంచుకున్నారు. ఆరు గ్యారెంటీలు, రుణమాఫీ, రైతు భరోసా నిధుల విడుదల వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజాధారణ తమకే ఉందని నిరూపించే ప్రయత్నం చేశారు. 36 నెలల ముందే ఫలితాలను ఊహిస్తున్నానంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యానం పాలనాపరమైన లోపాలపై వస్తున్న విమర్శల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వ మార్పుపై ప్రతిపక్షాలు ఆశలు పెట్టుకోకుండా, తమ ప్రభుత్వం సుస్థిరంగా ఐదేళ్లు కొనసాగుతుందనే బలమైన సందేశాన్ని కాంగ్రెస్ శ్రేణుల్లోకి పంపడమే రేవంత్ లక్ష్యం.

## నిజంగానే సర్వేలలో వ్యతిరేకత ఉందా?

ప్రభుత్వాలు మారిన కొత్తలో ఆశించిన స్థాయిలో హామీలు అమలు కానప్పుడు కొంతవరకు ప్రజా వ్యతిరేకత రావడం సహజం. కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, రైతు బంధు నిధుల ఆలస్యం వంటి అంశాలపై కాంగ్రెస్‌ను కార్నర్ చేయడానికి బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. అయితే, ఇప్పటికిప్పుడు బీఆర్ఎస్ మళ్లీ పుంజుకుని 78 సీట్లు సాధించేంత సీన్ ఉందా? లేదా కాంగ్రెస్ అంచనా వేస్తున్నట్లు 117 సీట్లు వస్తాయా? అనేది కేవలం ఊహాజనితమే. రాజకీయాలు ఎప్పుడు ఎలా మారిపోతాయో అంచనా వేయడం కష్టం. ఇరు పార్టీల అధినేతలు మాత్రం తమ పార్టీలకు గెలుపు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయనే భ్రమను లేదా నమ్మకాన్ని ప్రజల్లో ఉంచడానికి ఈ మైండ్ గేమ్‌ను సునిశితంగా వాడుకుంటున్నారు.

## తెలంగాణ పాలిటిక్స్‌లో మారిన నెరేటివ్

ఈ రాజకీయ సమరాన్ని గమనిస్తే తెలంగాణలో పట్టు కోల్పోకూడదని కాంగ్రెస్, కోల్పోయిన వైభవాన్ని తిరిగి తెచ్చుకోవాలని బీఆర్ఎస్ తీవ్రంగా శ్రమిస్తున్నట్లు స్పష్టమవుతోంది. కేటీఆర్ ప్రకటన పార్టీ ఉనికిని కాపాడుకునే రక్షణ వ్యూహం అయితే, రేవంత్ రెడ్డి ప్రకటన తామే సుప్రీం అని నిరూపించుకునే అగ్రెసివ్ అటాక్ . ఈ ఇద్దరు నేతలు అప్పుడే ప్రారంభించిన ఈ ముందస్తు సర్వేల యుద్ధం, రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయి రాజకీయాలను మరింత ఆసక్తికరంగా మార్చడం ఖాయం. అంతిమంగా ఓటరు దేవుడు ఎవరి వైపు ఉన్నాడనేది కాలమే నిర్ణయిస్తుంది.

# బద్రీనాథ్ విరాళాల దుర్వినియోగం కేసు

ఆ వీడియోలను తిరిగి పొందేందుకు సాంకేతిక నిపుణులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఘటనపై ఏర్పాటు చేసిన నాలుగు మంది సభ్యుల దర్యాప్తు కమిటీ విచారణ పూర్తి చేసి దేవస్థానం సీఈఓకు 18 పేజీల నివేదిక సమర్పించింది. ప్రాథమిక విచారణలో భక్తుల విరాళాలు, విలువైన వస్తువుల దుర్వినియోగం ఒక్కసారి కాదు, పలుమార్లు జరిగినట్లు గుర్తించినట్లు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విరాళాల లెక్కింపు గదిలో మరిన్ని సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఆలయ ప్రదక్షిణ మార్గంలోని 'బ్లైండ్ స్పాట్స్' అన్నింటినీ నిఘా పరిధిలోకి తీసుకురావాలని కమిటీ సూచించింది.ఘటనకు కేవలం 14 రోజుల ముందు సీసీటీవీ ఫుటేజీ మాత్రమే లభించినట్లు తెలిసింది. గతంలో ఏర్పాటు చేసిన కెమెరాల స్టోరేజ్ సామర్థ్యం కేవలం 15 రోజులకే పరిమితమై ఉండటంతో పాత రికార్డులు అందుబాటులో లేకపోయాయి. జులై 2 నాటి వీడియోలో నిందితుడు డబ్బు దుర్వినియోగం చేస్తున్న దృశ్యాలు కనిపించినట్లు అధికారులు గుర్తించారు. అలాగే ఆ ఘటనకు ముందు 14 రోజుల ఫుటేజీలో కూడా కొన్ని కీలక ఆధారాలు లభించినట్లు సమాచారం. ఈ కేసులో పారదర్శకత కోసం జులై 7న శ్రీ బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ఛైర్మన్ కార్యాలయంలో వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్న ప్రమోద్ నౌటియాల్‌ను సస్పెండ్ చేసింది. విధుల నిర్వహణలో తీవ్ర అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా తేలడంతో ఆయనకు ముందుగా షోకాజ్ నోటీసు జారీ చేశారు. అనంతరం కమిటీ నిర్వహించిన విచారణలో ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు గుర్తించడంతో తదుపరి చర్యలు చేపట్టింది.

# 36 ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

మూడేళ్లలో రాష్ట్రంలోని 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకోసం రూ.35,313 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ పనుల పురోగతి సహా ఇతర ప్రాజెక్టుల వివరాలను కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.అదేవిధంగా, ఏపీఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ) ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1023 సాగునీటి పథకాల పునరుద్ధరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రూ.3,883 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ పనుల ద్వారా సుమారు 8.42 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరంగా నీరందుతుందని అధికారులు అంచనా వేశారు. దీంతో పాటు, కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ఆధునికరణ కింద మన్యం, విజయనగరం జిల్లాల్లో ప్రత్యేక పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. భూగర్భ జలాలను పెంచేందుకు ఉద్దేశించిన 'జలధార' కార్యక్రమాన్ని కూడా సీఎం సమీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా 100 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 11,133 చెరువులు, ఫీడర్ ఛానళ్లను అభివృద్ధి చేసినట్లు అధికారులు వివరించారు. ఈ పనులను వీబీజీ రామ్ జీ సంస్థ ద్వారా చేపట్టాలని, జలధార పనుల కోసం ప్రతి జిల్లాకు తక్షణమే రూ.2 కోట్ల చొప్పున నిధులు విడుదల చేయాలని చంద్రబాబు ఆదేశించారు. కాగా, ఈ ఏడాది దేశంలోనే అత్యధికంగా రూ.2500 కోట్లను ఉపాధి హామీ పథకం కింద ఖర్చు చేసినట్లు అధికారులు ఈ సందర్భంగా సీఎం దృష్టికి తెచ్చారు.

# ఏపీ, తెలంగాణ జల జగడం

సరిదిద్దే వరకు ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.గోదావరి జలాలు, బనకచర్ల అనుసంధానం, పోలవరం ప్రాజెక్టు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఈ వ్యవహారంలో మొత్తం 15 మంది ప్రతివాదులు ఉన్నారని కోర్టుకు విన్నవించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పనులపై తాత్కాలిక నిలుపుదల (ఇంజక్షన్) ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు.అయితే ప్రధాన పిటిషన్‌లోనే పలు సాంకేతిక లోపాలు ఉన్నాయని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు తెలిపింది. అందులో ఉన్న లోపాలను సరిదిద్దుకుంటేనే విచారణను ముందుకు తీసుకెళ్లడం సాధ్యం అవుతుందని క్లారిటీ ఇచ్చింది. ముందుగా నిబంధనలకు అనుగుణంగా ఆ పిటిషన్‌ను సవరించాలని ఆ తర్వాతే కేసులోని ఇతర అంశాలను పరిశీలిస్తామని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఇక పిటిషన్‌ను విచారణకు స్వీకరించకముందే ప్రతివాదులకు నోటీసులు జారీ చేయడం లేదా ఈ వ్యవహారంలో తాత్కాలిక ఉత్తర్వులు ఇవ్వడం న్యాయపరంగా సాధ్యం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో రెండు రాష్ట్రాల నదీ జలాల విషయంలో తక్షణమే స్టే ఇవ్వడంతోపాటు ఏపీ సర్కార్‌కు నోటీసులు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన అభ్యర్థనలను సుప్రీంకోర్టు తిరస్కరించింది.మరోవైపు ఆ పిటిషన్‌లోని లోపాలను సరిచేసిన తర్వాత తిరిగి దానిపై విచారణ చేపట్టి మిగిలిన న్యాయపరమైన అంశాలపై నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు తెలిపింది. దీంతో పోలవరం ప్రాజెక్టు, గోదావరి జలాల వినియోగం , బనకచర్ల అనుసంధానానికి సంబంధించిన వివాదంలో ఏం జరగనుంది అనే పరిణామాలపై ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల దృష్టి సుప్రీంకోర్టు తదుపరి విచారణపైనే నిలిచింది.

# 'సింగరేణి భరోసా యాత్ర' ప్రారంభించిన బీజేపీ

అనంతరం ఖమ్మం జిల్లాకు చేరుకున్న వారికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ యాత్రలో భాగంగా నాలుగు జిల్లాల్లోని సింగరేణి గనుల కార్మికులను కలిసి, సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించనున్నట్లు బీజేపీ నేతలు తెలిపారు. తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపు వల్ల సింగరేణి దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి బలం చేకూరుతుందని, దీంతో కార్మికుల్లో విశ్వాసం పెరిగిందని రాంచందర్ రావు పేర్కొన్నారు.యాత్ర ప్రారంభానికి ముందు మాట్లాడిన రాంచందర్ రావు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ సింగరేణిని నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు.

ఈ కారణంగానే ప్రభుత్వ రంగ సంస్థ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని అన్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రం సింగరేణిని బలోపేతం చేయడానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం చరిత్రాత్మక నిర్ణయమని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బొగ్గు బ్లాక్‌లు వేలం ద్వారా కేటాయించాల్సి ఉన్నప్పటికీ, చట్టపరమైన అవకాశాలను పరిశీలించి, న్యాయ సలహా తీసుకున్న అనంతరం మోదీ ప్రత్యేకంగా ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ట్రేడ్ యూనియన్ల విజ్ఞప్తి మేరకు తాను ప్రధానితో చర్చించి ఈ కేటాయింపును సాధించామని చెప్పారు.

# తెలంగాణ విశాల ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయాలి

కలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతుల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశ జనాభాలో 10 శాతం జనాభా ఆరు మహా నగరాల్లో హైదరాబాద్‌లో ఉందని ఈ నగరాలు 25శాతం జీడీపీ కలిగి ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు కోసం కేంద్ర ఆర్థిక శాఖ అనుమతి అవసరమని, ఎంపీలు ఈ విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ని కలిసి ఐఐఎం మంజూరుకు విజ్ఞప్తి చేయాలని సూచించారు.

## మెట్రో ఫేజ్-2 విస్తరణపై కేంద్రంతో చర్చించాలి

హైదరాబాద్ మెట్రో ఫేజ్- 1 స్వాధీనం, మెట్రో ఫేజ్-2 విస్తరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో చర్చల సరళిని ఎంపీలకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఇందుకు సంబంధించి ఎస్‌బీఐ కాప్స్‌ని కన్సల్టెంట్‌గా నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, ఆ ప్రక్రియ త్వరగా ముందుకు సాగేలా చూడాలని కోరారు. ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్‌కి, కొండా విశ్వేశ్వర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్ ఉత్తర భాగంలో 95 శాతం భూ సేకరణ పూర్తయిందని ఆ పనుల ప్రారంభానికి, దక్షిణ భాగం ఆర్ఆర్ఆర్ భూ సేకరణకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలపాల్సి ఉందని చెప్పారు. ఈ విషయంలో కూడా ఎంపీలు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కోరారు. మూసీ పునరుజ్జీవనం పనుల్లో మొదటి దశ టెండర్ల దశకు వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ పనులను అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద తీసుకునే విషయంలో కేంద్ర అప్రూవల్ లెటర్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఎంపీలు ఈ విషయంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ని కలిసి విజ్ఞప్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

## తుంగభద్ర నీటిపై పోరాడాలి

అంతరాష్ట్ర నదీ జలాల విషయమై ఇటీవల కర్ణాటకలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో ఏపీ, కర్ణాటక ముఖ్యమంత్రులతో చర్చించిన అంశాలను ఎంపీలకు వివరించారు. తుంగభద్ర నుంచి తెలంగాణకు 15.09 టీఎంసీల నీరు రావలసి ఉన్నా పూడికతో 5 టీఎంసీలకు మించి రావడం లేదన్నారు. డ్యామ్‌తో పాటు కాలువల్లో పూడిక తొలగింపునకు ఏపీ, కర్ణాటక సహకరించేలా ఒప్పించాలని కేంద్ర మంత్రిని కోరామని, ఈ విషయంపై ఎంపీలు కేంద్ర మంత్రిని కలసి పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. నదుల అనుసంధానంలో గోదావరి నుంచి నాగార్జున సాగర్‌కు నీళ్లు తీసుకునే విషయంలో ఛత్తీస్‌గఢ్‌ను ఒప్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

## గోదావరి-కావేరి అనుసంధానంపై దృష్టి పెట్టండి

'గోదావరిలో ఛత్తీస్‌గఢ్‌కు 300 టీఎంసీల వాటా ఉందని, వాటిని ఛత్తీస్‌గఢ్ వాడుకోవడం లేదు.భవిష్యత్‌లో 160 టీఎంసీలు వాడుకున్నా 143 టీఎంసీలు మిగులు ఉంటాయన్నారు. అందులో తెలంగాణకు 43 టీఎంసీలు లభించే అవకాశం ఉంది'అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.'గోదావరి నుంచి ఏపీ ప్రాంతం మీదుగా తమిళనాడు, కర్ణాటక, కేరళకు నీరు తీసుకెళ్లే గోదావరి-కావేరి అనుసంధానం ఉంది. ఈ విషయంలో ఎంపీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.ఇక్కడ నీళు ఛత్తీస్‌గఢ్‌వి అయితే నిధులు కేంద్రానివని. ఆ రెండింటిని తెలంగాణకు అనుకూలంగా సాధించాలి'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాజెక్టులకు ఏపీ నిరభ్యంతర పత్రాలు ఇవ్వాల్సి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఈ విషయంపైనా జలశక్తిమంత్రి సీఆర్ పాటిల్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించామన్నారు. వారు సూత్రప్రాయంగా అంగీకరించారని, ఎన్‌వోసీలు వస్తే వాటికి ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

## దేవేంద్ర ఫడ్నవీస్‌తో భేటీ అవుదాం

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు సంబంధించి 150-151 అడుగుల్లో నిర్మించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో భేటీ అవుదామని ఎంపీలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. 'శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బెంగళూరు, చెన్నై, ముంబయిలకు వెళ్లే బుల్లెట్ రైళ్లకు సంబంధించి ఎలైన్‌మెంట్లు కొలిక్కివచ్చాయని సమావేశంలో వివరించారు. ఆదిలాబాద్ డిఫెన్స్ ఎయిర్‌పోర్ట్, వరంగల్ ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూ సేకరణ పూర్తి చేశామని తెలిపారు. ఈ ఎయిర్‌పోర్టుల్లో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్ హాలింగ్), ఎయిర్ కార్గోలు ఏర్పాటు చేయాలని కోరుతున్నామని, ఈవిషయంపైనా ఎంపీలు దృష్టిసారించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంతో సహకరిస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా ఎంపీలకు అవసరమైన సమాచారం అందించడానికి ఢిల్లీ తెలంగాణ భవన్‌లో కో-ఆర్డినేషన్ కు ఐఏఎస్ అధికారి అద్వైత్ కుమార్ సింగ్‌ను నియమించిన విషయాన్ని ప్రస్తావించారు. పెండింగ్ అంశాలకు సంబంధించి ఏ సమాచారం కావాలన్నాఆయన దగ్గర నుంచి తీసుకోవచ్చని సూచించారు. అన్ని పార్టీల ఎంపీలను సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ఎంపీల కన్వీనర్ డాక్టర్ మల్లు రవికి సీఎం సూచించారు. సమావేశంలో ఎంపీలు పలు అంశాలను ప్రస్తావించారు.డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు జితేందర్, ఎంపీలు అనిల్ కుమార్, మల్లు రవి, ఈటల రాజేందర్, రఘువీర్ రెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కడియం కావ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

# ఆరుగురిని చంపిన రాజ్‌కుమార్ ఆత్మహత్య

అతడు పురుగుల మందు తాగి చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇక హత్యలు చేసిన తర్వాత నిందితుడిని పట్టుకునేందుకు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు సుమారు 14 ప్రత్యేక బృందాలతో విస్తృతంగా గాలింపు చేపట్టారు. రాజ్‌కుమార్ ఆచూకీ తెలిపిన వారికి రూ.2 లక్షల నగదు బహుమతిని కూడా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. పోలీసుల గాలింపు చర్యలు తీవ్రం కావడంతో అతడికి ఎక్కడా ఆశ్రయం దొరకలేదని చివరికి కొత్తూరు మండలంలోని తన మేనమామ ఊరైన పంజర్లకు చేరుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆ గ్రామ శివారులోనే పురుగుల మందు తాగి చనిపోయినట్లు పేర్కొంటున్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడ గ్రామంలో ఒకే రాత్రి ఆరుగురిని అతి దారుణంగా నరికి చంపి రాజ్‌కుమార్ రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం రేపాడు. గత 3 రోజులుగా రాజ్‌కుమార్ కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చేపట్టగా తాజాగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు మండలం పంజర్ల గ్రామ శివారులో రాజ్‌కుమార్ మృతదేహం లభ్యం కావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

# తెలంగాణకు తాగునీటి ముప్పు

డెడ్ స్టోరేజీకి పైన వినియోగించదగిన నీరు కేవలం 3 టీఎంసీలే మిగిలి ఉండగా ప్రతి నెల తాగునీటి అవసరాలకు సుమారు అర టీఎంసీ అవసరం అవుతోంది.లోయర్ మానేరు, ఎల్లంపల్లి, కడెం, జూరాల, నాగార్జునసాగర్, నిజాంసాగర్, సింగూర్, కోయిల్‌సాగర్, రామన్‌పాడు, అక్కంపల్లి, వైరా, ఉదయసముద్రం, ధర్మసాగర్ వంటి జలాశయాల్లోనూ నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. హైదరాబాద్‌తో పాటు కరీంనగర్, వరంగల్, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాలు ఈ జలాశయాలపై ఆధారపడి ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న నిల్వలతో మంజీరా, సింగూర్, గోదావరి వ్యవస్థల నుంచి సెప్టెంబర్ చివరి వరకు మాత్రమే తాగునీరు అందించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ అవసరాల కోసం సింగూర్‌లో కనీసం 16 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖకు సూచనలు వెళ్లాయి. ఇదిలా ఉండగా భూగర్భ జలాల పరిస్థితి కూడా దిగజారుతోంది. జూన్ నాటికి రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టం 9.46 మీటర్ల లోతుకు పడిపోయింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని బోర్లను మరింత లోతుగా తవ్వడం, అవసరమైన చోట కొత్త బోర్లు ఏర్పాటు చేయడం, వర్షపు నీటి సంరక్షణ చర్యలను వేగవంతం చేయడం వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ప్రభుత్వం చేపడుతోంది. అయితే భారీ వర్షాలు త్వరలో కురవకపోతే కృష్ణా-గోదావరి జలాశయాల్లో నిల్వలు పెరగకపోతే తెలంగాణలో రానున్న నెలల్లో తాగునీటి సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ధవళేశ్వరం బ్యారేజీకి కొత్త కళ

అలాగే కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని ముఖ్యమంత్రి అడిగారు. 14,700 క్యూసెక్కుల నీరు కాల్వలకు వదిలామని అధికారులు చెప్పారు. కాల్వ చివరి భూములకూ నీరు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుకలంకలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

## తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తంగా కొత్త గేట్లను బిగించాం

గోదావరి డెల్టాకు దేశానికే అన్నపూర్ణ అనే ఖ్యాతి రావడానికి సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టే కారణమని, అనంతరం ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన కొత్త బ్యారేజీతో మరో పంటకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. 2.9 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం, 32.2 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునే సామర్థ్యంతో పాటు ఈస్టర్న్, సెంట్రల్, వెస్టర్న్ డెల్టాల్లో కలిపి 10.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా బ్యారేజీ ఉపయోగపడుతోందన్నారు. అయితే 50 ఏళ్లకు పైగా గేట్లు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థలు పాతబడటంతో వాటి ఆధునీకరణ అత్యవసరమైందని ముఖ్యమంత్రి చెప్పారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.32 కోట్లతో కొత్త గేట్లను అమర్చిందని, ఇప్పుడు మిగిలిన పాత గేట్ల స్థానంలో 117 కొత్త గేట్లను తొమ్మిది నెలల్లో అమర్చేలా చర్యలు ప్రారంభించామని సీఎం తెలిపారు. గత పాలకులు ఇరిగేషన్ ప్రాజెక్టులను కనీస నిర్వహణ కూడా చేపట్టలేదని విమర్శించారు. గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని కనీసం గ్రీజ్ పెట్టేందుకు అవసరమైన నిధులను కూడా గత పాలకులు ఇవ్వలేదని ముఖ్యమంత్రి అన్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తంగా కొత్త గేట్లను బిగించామని వివరించారు. తాము గత రెండేళ్లలోనే సాగునీటి రంగానికి రూ.24 వేల కోట్లు వెచ్చించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.

## పోలవరం నిర్వాసితులను ఆనందంగా ఉంచుతాం

ఒకప్పుడు కోనసీమలో వరికి మద్దతు ధర లేక రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి నెలకొంటే, ఇప్పుడు రైతుల ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు విక్రయించిన 24 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని సీఎం విమర్శించారు. 2014-19 మధ్య 72 శాతం పనులు పూర్తిచేయగా, ఆ తర్వాత ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే జరిగాయని అన్నారు. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు వేగవంతమై ప్రస్తుతం 89 శాతం పురోగతి సాధించామని తెలిపారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తామని, పునరావాసం, పరిహారం విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. వారిని ఆనందంగా ఉంచుతామని అనుకున్న సమయానికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు చేపడుతోందని చెప్పారు. పోలవరం పూర్తయితే గోదావరి జిల్లాలకు నీటి సమస్య శాశ్వతంగా తీరుతుందని, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టా, రాయలసీమకు తరలించి అక్కడి వ్యవసాయ రూపురేఖలనే మార్చామని ముఖ్యమంత్రి వివరించారు. మైక్రో ఇరిగేషన్ విస్తరించడంతో ఉద్యాన పంటలు అభివృద్ధి చెందాయని, పరిశ్రమలకు నీటి సరఫరా సాధ్యమై కియా వంటి భారీ పరిశ్రమలు రాయలసీమకు వచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## కూటమిపై గోదావరి జిల్లాల ప్రజల అభిమానం తరగనిది

గోదావరి ప్రజలు అభివృద్ధిని ఆదరించే స్వభావం కలవారని, గతంలోనూ టీడీపీకి అపూర్వ ఆదరణ ఇచ్చారని చంద్రబాబు గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో కూటమికి ఇచ్చిన భారీ విజయాన్ని రాష్ట్ర అభివృద్ధికి ఇచ్చిన ఆశీర్వాదంగా భావిస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రజల సహకారం, భగవంతుడి ఆశీస్సులతో ఆర్థిక సవాళ్లను అధిగమించి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పుష్కర ఘాట్ల అభివృద్ధితో పాటు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో సుమారు రూ.1,200 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. పిచ్చుకలంక, బొబ్బర్లంక ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని, కోనసీమకు రైల్వే లైన్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. కోవ్వూరులో కోకో సిటీ ఏర్పాటు చేయనున్నట్లు కూడా ప్రకటించారు. ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని, మెట్ట ప్రాంతాల్లో పామాయిల్, కోకో సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని చెప్పారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో శాస్త్రీయ విధానాలు అనుసరించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

## అభివృద్ధి-సంక్షేమమే కూటమి లక్ష్యం

రాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నెలలోనే తల్లికి వందనం నిధులు జమ చేస్తామని, సామాజిక భద్రత పెన్షన్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ ప్రజల మధ్యకే రావాలనే తపనతో ఉన్నారని, ముంబై వెళ్లి ఆయనను పరామర్శించి పూర్తిగా కోలుకున్న తర్వాతే ప్రజాసేవలో పాల్గొనాలని సూచించినట్లు చెప్పారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, రౌడీయిజంపై రాజీపడబోమని సీఎం హెచ్చరించారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు, వ్యక్తిత్వ హననం, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. గంజాయిని ప్రోత్సహించే వారిపైనా, మహిళలను కించపరిచే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రౌడీలతో, బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ లను మించి గొడ్డలి పార్టీతోనే సమస్యలు సృష్టిస్తోందని సీఎం మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఆడవాళ్లని అసభ్యంగా మాట్లాడే వారిని గొడ్డలి పార్టీ సమర్థిస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ గొడ్డలి పార్టీ నేతలు ఫైనాన్స్ చేస్తున్నారు, స్టూడియోలు పెట్టిస్తున్నారని విమర్శించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను గొడ్డలి పార్టీ సపోర్ట్ చేస్తోందని వారికి డబ్బులిచ్చి ప్రొత్సహిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. వీళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.ం

# బోనాల జాతరకు సర్వం సిద్ధం

పండుగ నిలుస్తూ వస్తోంది. ఇక ఈ ఏడాది జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు బోనాల పండగ ఘనంగా జరగనుంది. హైదరాబాద్- సికింద్రాబాద్ జంట నగరాల్లో బోనాల ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు ఆలయాలకు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ బోనాల పండగపై సమీక్ష నిర్వహించారు.జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాలతో మొదలవుతుంది. అలాగే 20,21, 22 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవ ఉత్సవాలు జరుగుతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ మేరకు 20 న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఎదుర్కోలు ఉత్సవం, 21 వ తేదీన అమ్మవారి కల్యాణం, 22వ తేదీన రథోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఇక ఆగస్టు 2 న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు, ఆగస్టు 3న రంగం కార్యక్రమం, ఆగస్టు9 న లాల్ దర్వాజా సింహ వాహిని అమ్మవారి బోనాలు జరుగుతాయని ఈ మేరకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.మరోవైపు బోనాల పండగ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం 3,427 ఆలయాలకు రూ.15.05 కోట్ల నిధులు విడుదల చేసింది. ఉత్సవాలను వైభవంగా జరిపేందుకు ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్ శాఖ, పోలీసు , ఆరోగ్య శాఖల సమన్వయంతో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

# రోడ్డుపై 500 ఓటర్ కార్డులు!

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో తీవ్ర కలకలం రేపిన ఘటనలో, 500కు పైగా ఓటర్ గుర్తింపు కార్డులు రోడ్డుపై పడి ఉండటం వెలుగులోకి వచ్చింది. పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జల్‌పల్లి ఫారెస్ట్ పార్క్ సమీపంలో, జల్‌పల్లి రోడ్డుపై ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. రోడ్డుపై అనుమానాస్పదంగా పడి ఉన్న బ్యాగును గమనించిన కొందరు స్థానికులు, మీడియాకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ఆ బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. విచారణ ప్రారంభించగా, అందులో లభించిన ఓటర్ కార్డులు అధికంగా చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గానికి చెందినవిగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం జరుగుతున్న తరుణంలో ఈ ఘటన చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇంకా చాలా మందికి ఓటర్ కార్డులు అందాల్సి ఉండగా, ఇలా వందలాది కార్డులు రోడ్డుపై పడేసి ఉండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కీలకమైన పత్రాల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని వారు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కార్డులను వెంటనే అసలైన యజమానులకు చేర్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జూలై 24 వరకు ఇంటింటి ఓటర్ల సర్వే జరుగుతుండగా, జూలై 31న ముసాయిదా జాబితా విడుదల చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఘటన అధికారుల పనితీరుపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.

## కాలువ నిర్మాణ నష్టపరిహారం వెంటనే చెల్లించాలి

**- పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆర్డీఓకు సీపీఎం వినతి**




**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సీపీఎం పార్టీ గజ్వేల్ ఏరియా కమిటీ సందేమైనా ఎల్లయ్య ఆధ్వర్యంలో రాయపోలు మండల పరిధిలోని టెంకంపేట గ్రామానికి చెందిన కొండపోచమ్మ సాగర్ కాలువ నిర్మాణంతో నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న కాలువ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ సోమవారం గజ్వేల్ ఆర్డీఓ నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు సందేమైనా ఎల్లయ్య మాట్లాడుతూ, కాలువ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులు ఇప్పటికీ పూర్తిస్థాయి నష్టపరిహారం అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కాలువ పనులు పూర్తి కాకపోవడంతో రైతులు సాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.రైతుల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించి, అర్హులైన రైతులకు నష్టపరిహారం చెల్లించడంతో పాటు కాలువ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## బద్దిపల్లిలో ఓటర్ నమోదు కార్యక్రమంలో

# కాంగ్రెస్ నాయకులు

**కొత్తపల్లి మండలం** బద్దిపల్లి గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన ఓటర్ నమోదు కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సింగిరాల వెంకటస్వామి, బీఎల్ఏ మునిగల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవడం, వివరాలను సరిచూసుకోవడం యొక్క ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి అర్హుడూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

# నులిపురుగులకు చెక్...

## చిన్నారుల ఆరోగ్యానికి ఆల్బెండజోల్ మేలు

**- 1 నుంచి 19 ఏళ్లలోపు ప్రతి బాలబాలిక తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్ర తీసుకోవాలి**

**- సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్**

**తాండూర్** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాదారం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ సెంటర్-3లో సోమవారం ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ కుశనపల్లి మీన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.నులిపురుగుల నివారణతోనే పిల్లల ఆరోగ్యవంతమైన భవిష్యత్ ఈ సందర్భంగా సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఆల్బెండజోల్ మాత్రలను 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి బాలబాలిక తప్పనిసరిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈ మాత్ర వేయించి నులిపురుగుల సమస్య నుంచి రక్షించాలని సూచించారు. ఈ మాత్ర వల్ల నులిపురుగులు నివారించబడటంతో పాటు రక్తహీనత తగ్గి, పిల్లలు ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఎదగడానికి దోహదపడుతుందని తెలిపారు.వైద్య సిబ్బంది పర్యవేక్షణలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించడంతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత, సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యుడు గొల్లపల్లి బానేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి, ఏఎన్ఎం పద్మ, ఆశా కార్యకర్త మల్లీశ్వరి, గ్రామస్థులు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బాల్యంపై భారం

**- పుస్తకాల బరువుతో వంగిపోతున్న చిన్నారులు**

**- చిన్న వయస్సులో వెన్నెముకపై సామర్థ్యాన్ని మించి భారం**

**- అమలుకు నోచుకోని విద్యాహక్కు చట్టం**

**జగిత్యాల** బాల్యంపై భారం పెరిగిపోతోంది. వారిని పుస్తకాల బరువు కుంగదీస్తోంది. కిలోల కొద్ది బరువును వీపుపై మోస్తూ అనారోగ్యం భారిన పడాల్సి వస్తోంది. పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ లాభాపేక్ష కోసం ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాయి. విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అవసరంలేని, అర్హతకు మించిన పుస్తకాలను కొనుగోలు చేయించి విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. వాస్తవానికి నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ విద్యార్థులకు అసలు పుస్తకాలు ఉండొద్దని చట్టం పేర్కొంటుంది. కానీ ఈ నిబంధనలేవి అమలవడం లేదు. అంతేనా పలు ప్రైవేటు పాఠశాలలు పుణ్యమా అని ఒకటి రెండు తరగతుల విద్యార్థులే 30 నుంచి 45 పుస్తకాలను మోస్తున్నారు. విద్యార్థులకు తరగతి గదులే సరిపడా లేని పలు పాఠశాలల్లో ఇక లాకర్ల సదుపాయం ఎక్కడ ఉంటుందనే వాదన వినిపిస్తోంది. కానీ ఇలాంటి పాఠశాలలను అధికారులు పట్టించుకోవడంలే దని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మారిన ఫ్యాషన్ పోకడలను అనుసరించి విద్యార్థులు నడుం కిందకు బ్యాగు వేసుకుంటున్నారు. ఇలా వేసుకోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయితే ఈ ఏడాది అకాడమిక్ క్యాలెండర్ ను విడుదల చేసిన ప్రభుత్వం పది బ్యాగ్ లెస్ డేస్ ను నిర్వహించాలని, నెలలో ప్రతీ మూడో శనివారం నో బ్యాగ్ డేగా పాటించాలని నిర్ణయం తీసుకుంది.

## చేతివృత్తులను ఆదరించండి

## హస్త కళలను ప్రోత్సహించండి

**పెదవాల్తేరు..** దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన చేతి వృత్తులను ఆదరించాలని.. హస్త కళలను ప్రోత్సహించాలని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పిలుపునిచ్చారు.. సోమవారం ఇక్కడ కరక చెట్టు పోలమాంబ ఆలయం వద్ద ఆలిండియా క్రాఫ్ట్ బజార్ ను ముఖ్యఅతిథిగా హాజరై వెలగపూడి ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 రాష్ట్రాలకు చెందిన చేతివృత్తులు.. హస్తకళలు. చేనేత వస్తువులు ఉత్పత్తి ధరలకే విక్రయిస్తుండడంతో వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.. వినియోగదారులు అందిస్తున్న అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.. ఆల్ ఇండియా క్రాఫ్ట్ బజార్ పేరుతో దేశంలోనీ వివిధ ప్రాంతాల్లో లభ్యమయ్యే వస్తువులను ఒకే చోటకు తీసుకువచ్చి ప్రదర్శించడం.. విక్రయించడం వల్ల అన్ని వస్తువులను ఒకే చోట సందర్శించి తక్కువ ధరలకు కొనుగోలు చేసే అవకాశం ఉంటుందన్నారు.ద

గౌరవ అతిథిగా హాజరైన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ తక్కువ ధరకు లభ్యమయ్యే ఈ బజార్ ను ప్రజలు ఉచితంగానే తిలకించవచ్చునన్నారు.. అలాగే నాణ్యమైన చీరలు.. గృహోపకరణాలకు అవసరమయ్యే సామగ్రి అంతా ఇక్కడ అందుబాటులో ఉందన్నారు.. కావున ఆయా ప్రాంతాల ప్రజలు ఆలిండియా క్రాఫ్ట్ బజార్ ను సందర్శించాలని గంట్ల శ్రీను బాబు కోరారు..ఎగ్జిబిషన్ నిర్వాహకులు.. విశాఖ ఆర్టిసియన్స్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు ×మొహమ్మద్ నసీం×మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో హైదరాబాద్ నుంచి ముత్యాలు.. కలంకారి పెయింట్స్.. రాజస్థాన్ బెడ్ షీట్స్.. బెంగాల్ కాటన్ సారీస్.. కాటన్ డ్రెస్ మెటీరియల్.. మైసూర్ రోజ్ వుడ్.. తో పాటు అనేక రకాల వస్తువులను అందుబాటులో ఉంచామన్నారుఈ ప్రదర్శన ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందన్నారు..

## కబ్జాదారుల నుంచి రూ.150 కోట్ల విలువైన జీవీఎంసీ స్థలాలను కాపాడండి

**- తప్పుడు సర్వే నివేదికలతో ఫైలు కదలిక - కోర్టు కేసులను కాదని కబ్జాదారులకు కట్టబెట్టే ప్రయత్నాలు**

**- కబ్జాదారులకు మద్దతుగా మరో నియోజకవర్గ శాసనసభ్యుడు**

**- మునిసిపల్ మంత్రి కి లేఖలు - ఆ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనసభ్యులు మౌనం**

**- పోరాటం చేస్తున్న కాలనీవాసులకు దక్కని అధికారుల మద్దతు**

**- ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకొని పార్కులను జీవీఎంసీ స్థలాలను కాపాడాలి**

**- జనసేన నేత పీతల మూర్తి యాదవ్ డిమాండ్**

**విశాఖపట్నం** పారదర్శక పాలనను ప్రజలకు అందిస్తూ ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడమే ధ్యేయంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో కొందరు అవినీతి అధికారుల కారణంగా విశాఖ నగరంలో విలువైన జీవీఎంసీ స్థలాలు ప్రైవేటుపరం అయిపోతున్నాయి. తప్పుడు సర్వే నివేదికలు, ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కైన కొందరు అధికారుల స్వార్థం కారణంగా దశాబ్దాలుగా జీవీఎంసీ ఆస్తులుగా ఉన్న వీటిని ప్రైవేటు పరం చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొందరు ప్రజా ప్రతినిధులు కూడా జీవీఎంసీ ఆస్తులను కాజేసే ప్రయత్నం చేస్తున్న ప్రైవేటు వ్యక్తులకు వత్తాసు పలుకుతూ అధికారులపై ఒత్తిడి తీసుకురావడం నిజంగా దురదృష్టకరం.

**మున్సిపల్ వాటర్ ట్యాంక్ ప్రైవేటు వ్యక్తులదే అట**

అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో దశాబ్దాలుగా మహావిశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) వినియోగంలో ఉన్న సర్వే నెంబర్ 6/2 లోని ఎకరం 25 సెంట్లు భూమిపై ప్రైవేటు వ్యక్తులు కన్ను పడింది. రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ స్థలాన్ని జీవీఎంసీ ఎప్పటినుంచో వినియోగిస్తుంది. ఇందులో వేలాదిమంది ప్రజలకు నీరు అందించే ఓవర్ హెడ్ ట్యాంకులతోపాటు జీవీఎంసీ కి చెందిన కార్యాలయం, సులబ్ కాంప్లెక్స్ వంటివి ఉన్నాయి. అంతేగాక పారిశుద్ధ్య వాహనాల పార్కింగ్ గా ఇందులో కొంత స్థలాన్ని వినియోగిస్తున్నారు. అయితే దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే ఒత్తిడి మేరకు జీవీఎంసీ సర్వే అధికారులు సర్వే జరిపి నివేదిక సమర్పించారు. ఈ స్థలంలో జీవీఎంసీ ఆస్తులు ఉండటంతో సర్వే నివేదికలో వాటినే పేర్కొనాల్సి వచ్చింది. దాంతోపాటు ఎప్పటివో ఒకటి రెండు కేసులు పెండింగ్లో ఉన్నాయన్న విషయాన్ని సర్వే నివేదికలో రాశారు. అదే ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులు పారిట వరంగా మారబోతుంది.

## ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన

# దరఖాస్తులను పరిష్కరించాలి




**సిద్దిపేట** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారుసోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల వినతులను జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ తో కలిసి జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేసి అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో పరిష్కారం కోసం వచ్చేసిన ప్రజల నుండి మొత్తం 109 దరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ నాగరాజమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, ఎస్డిసి సుదర్శన్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## రైతు పొలాలకు దారి వేయలేని పథకానికి కోట్ల రూపాయలు ఖర్చు చేయడం ఎందుకు...?

**- రైతుల సమస్యలు పరిష్కరించకపోతే రైతులతో కలసి ఉపాధి కార్యాలయం ముట్టడి.**

**- పత్తికొండ నియోజకవర్గం బిజెపి నాయకులు తుగ్గలి నవీన్ రెడ్డి.**

**తుగ్గలి:** రైతుల పంట పొలాలకు వెళ్లే రహదారులకు దారి వెయ్యలేని పథకానికి కోట్లు ఖర్చు చేయడం ఎందుకు అని...? పత్తికొండ నియోజకవర్గం బిజెపి నాయకులు తుగ్గలి నవీన్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు.సోమవారం రోజున ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన తుగ్గలి నందు పంట పొలాలకు వెళ్లే కనీస రహదారులు లేక వేలాది మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తుగ్గలి నవీన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.ట్రాక్టర్లు, హార్వెస్టర్లు,ఇతర వ్యవసాయ యంత్రాలు పొలాల వరకు చేరుకోలేక సాగు ఖర్చులు పెరుగుతున్నాయని, పంటలను మార్కెట్‌కు తరలించడంలో రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు.ఒకవైపు విబి?జీ రామ్ జీ పథకం కింద కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు అవుతుండగా, మరోవైపు రైతులకు అత్యంత అవసరమైన పొలాల దారుల నిర్మాణం నిర్లక్ష్యానికి గురవడం దురదృష్టకరమన్నారు.రైతుల అవసరాలే ప్రభుత్వ పథకాల మొదటి ప్రాధాన్యంగా ఉండాలని,ప్రతి గ్రామంలో పంట పొలాలకు వెళ్లే రహదారులను గుర్తించి అత్యవసరంగా నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.కాగితాలపై పనులు చూపించడం కాదని? రైతులకు ఉపయోగపడే శాశ్వత ఆస్తులు సృష్టించడమే ప్రభుత్వ పథకాల అసలు లక్ష్యం కావాలని ఆయన తెలియజేశారు.రైతు పొలానికి దారి వేయలేని పథకానికి కోట్ల రూపాయలు ఖర్చు చేయడం వల్ల రైతుకు,గ్రామానికి కలిగే ప్రయోజనం ఏమిటని తుగ్గలి నవీన్ రెడ్డి ప్రశ్నించారు.రైతులకు పొలాల దారుల నిర్మాణంపై వెంటనే కార్యాచరణ ప్రారంభించకపోతే,రైతులు,వ్యవసాయ కూలీలు,ప్రజా సంఘాలతో కలిసి ఉపాధి కార్యాలయాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా ముట్టడించి,పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుందని రైతు పొలానికి దారి వేయడం ప్రభుత్వ తొలి బాధ్యతని ఆయన తెలియజేశారు.రైతుల కష్టాలను విస్మరిస్తే ప్రజా ఉద్యమం తప్పదని బిజెపి నాయకులు తుగ్గలి నవీన్ రెడ్డి స్పష్టం చేశారు

## బద్వేలు టిడిపి ఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డికి పలువురు అభినందనలు శుభాకాంక్షలు





**బద్వేలు** బద్వేలు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డికి సోమవారం పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు స్థానిక ఎన్జీవో కాలనీ లోని పార్టీ కార్యాలయంలో సూర్యనారాయణ కొన్ని వందల మంది నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు తెలుగుదేశం పార్టీ రాజకీయ రణరంగంలో సూర్యనారాయణ రెడ్డి ఇన్చార్జిగా విజేతగా గెలిచారని వారు ఆయనను అభినందించారు త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజేతలుగా గెలిపించాలని వారు సూర్యనారాయణ రెడ్డిని కోరారు ఆయనను అభినందించిన వారిలో వ్యక్తిగత అభిమానులు కూడా ఉన్నారు

## ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

**- ప్రైవేటు పాఠశాలలకు ఎంఈవో సునీలమ్మ సూచనలు**

**గూడూరు** గూడూరు మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల కరెస్పాండెంట్లు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని మండల విద్యాశాఖ అధికారి కె. సునీలమ్మ ఒక ప్రకటనలో సూచించారు.ప్రభుత్వం నుంచి చెల్లుబాటు అయ్యే అనుమతులు పొందిన పాఠశాలలు మాత్రమే కొనసాగించాలని ఆమె స్పష్టం చేశారు. విద్యార్థుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను మాత్రమే వసూలు చేయాలని, అదనపు ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై భారం మోపకూడదని తెలిపారు.పాఠశాలల్లో చదివే విద్యార్థులను పుస్తకాలు, యూనిఫాంలు తమ పాఠశాలల నుంచే కొనుగోలు చేయాలని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒత్తిడి చేయరాదని హెచ్చరించారు. తల్లిదండ్రులకు తమకు నచ్చిన చోట విద్యా సామగ్రి కొనుగోలు చేసే స్వేచ్ఛ ఉందని పేర్కొన్నారు.అన్ని పాఠశాలలు తాగునీరు, మరుగుదొడ్లు, పరిశుభ్రమైన తరగతి గదులు, భద్రతా ఏర్పాట్లు వంటి మౌలిక సదుపాయాలను తప్పనిసరిగా కల్పించాలని సూచించారు. పాఠశాల బస్సులు నడుపుతున్న యాజమాన్యాలు వాహనాలకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఉండేలా చూడడంతో పాటు, అర్హత కలిగిన డ్రైవర్లను మాత్రమే నియమించాలని తెలిపారు.అదేవిధంగా అర్హతలు కలిగిన ఉపాధ్యాయులను నియమించుకోవాలని, ప్రభుత్వం నిర్వహించే పరీక్షలను విధిగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులను శారీరకంగా శిక్షించకూడదని, వారి చేత ఎలాంటి వ్యక్తిగత లేదా ఇతర పనులు చేయించరాదని స్పష్టం చేశారు.ప్రభుత్వం నిర్దేశించిన అన్ని నిబంధనలు, మార్గదర్శకాలను ప్రతి ప్రైవేటు పాఠశాల యాజమాన్యం తప్పనిసరిగా అమలు చేయాలని, ఉల్లంఘనలకు పాల్పడితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని మండల విద్యాశాఖ అధికారి కె. సునీలమ్మ హెచ్చరించారు

## ఆషాఢ బోనాల జాతరకు

# ప్రభుత్వం సర్వం సిద్ధం

**- మంత్రి పొన్నం ప్రభాకర్**




**హైదరాబాద్** జూలై 16 నుండి ఆగస్టు 13 వరకు గోల్కొండ నుంచి లాల్‌దర్వాజా వరకు బోనాల జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు. బోనాల ఉత్సవాల నిమిత్తం 3427 దేవాలయాలకు 15 కోట్ల 5 లక్షల 41 వేల 150 రూపాయలు విడుదల. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారుల సమన్వయం హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్. తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల జాతరను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో బోనాల ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు ఆలయాలకు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాలతో ప్రారంభంజూలై 20,21,22 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవ ఉత్సవాల్లో భాగంగా 20 న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఎదుర్కోలు ఉత్సవం,21న అమ్మవారికళ్యాణం, 22 న రథోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. ఆగస్టు 2న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో బోనాలు,ఆగస్టు 3న రంగం కార్యక్రమంఆగస్టు 9న హైదరాబాద్ నగరంలోని లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి బోనాల తో పాటు, నగరంలోని ప్రధాన దేవాలయాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్సవాల కోసం దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖ, రోడ్లు మరియు భవనాల శాఖ, ట్రాన్స్‌కో, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు, పౌర సరఫరాల శాఖ, టీజీఎస్ఆర్టీసీ, రైల్వే, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ, పురావస్తు శాఖతో పాటు ఇతర అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాలకు ఆర్టీసీ మహిళలకు ఉచిత బస్సులను నడిపిస్తున్నందున రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు

## హత్య కేసును ఛేదించిన పోలీసులు.. నిందితుడి అరెస్ట్

**హుజురాబాద్:** హుజూరాబాద్ లోని మామిండ్లవాడకు చెందిన చింత సునీత(35) హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు హుజూరాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి సోమవారం తెలిపారు. హత్య జరిగిన కేవలం 36 గంటల్లోనే ఈ కేసును చేయించినట్లు వివరించారు. సోమవారం హుజూరాబాద్ పోలీసు స్టేషన్ లో హత్య కేసు వివరాలను ఆమె వెల్లడించారు. హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన చింత సునీత (35) గత కొంతకాలంగా హుజూరాబాద్ మామిండ్లవాడలో నివాసం ఉంటుంది. ఆమె భర్త కుమార్ మృతి చెందగా, గత ఐదు సంవత్సరాలుగా మోతే కిరణ్ తో సహజీవనం చేస్తుంది. వీరిద్దరు మామిండ్లవాడ గ్యాస్ గోదాం సమీపంలో ఓ అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. సునీత తన పక్కన ఉన్న ఇంట్లో ముతోజు భాగ్య అనే మహిళతో స్నేహం పెంచుకుందన్నారు. తరచూ వీరిద్దరు కలిసి తిరుగుతుండటంతో సునీత వ్యభిచారం చేస్తుందనే అనుమానం కిరణ్ కలిగిందన్నారు. ఈ అనుమానంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవన్నారు. ఈ నెల 10న కిరణ్, సునీత ఇద్దరు కలిసి మద్యం సేవింవారన్నారు. ఇదే విషయమై మళ్లి గొడవ జరగడంతో ఆగ్రహానికి గురైన కిరణ్ ముందుగా సునీత గొంతును చేతులతో పిసికి, అనంతరం చిర ముక్కతో గొంతు బిగించి, కాలితో మెడపై తొక్కి హత్య చేశాడన్నారు. ఎవరికి తనపై అనుమానం రాకుండా ఉండేందుకు సునీత మృతదేహాన్ని ఎత్తుకొని వెళ్లి తన స్నేహితురాలైన ముతోజు భాగ్య ఇంటి సమీపంలోని బావిలో పడేశాడన్నారు. సునీత ధరించిన లో దుస్తులు (ప్యాంట్, డ్రాయర్) ను బావికి సమీపంలోని చెట్టు వద్ద పడవేసి, అక్కడి నుంచి పరారై కరీంనగరకు వెళ్లిపోయాడని పేర్కొన్నారు. సిఐ కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 13న సోమవారం హుజూరాబాద్ కు తిరిగి వచ్చాడనే పక్కా సమాచారం అందటంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, స్వచ్ఛందంగా నేరాన్ని ఒప్పుకున్నాడన్నారు. సంఘటన జరిగిన ఇంటిని, మృతదేహాన్ని పడవేసిన బావిని, దుస్తులు పడవేసిన స్థలాన్ని చూపించాడన్నారు. సంఘటన స్థలం నుంచి పగిలిన గాజులు, గాజు ముక్కలు, పుస్తెల పూసలు, కాలి పట్టి తదితర కీలక ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే బావి సమీపంలో పడవేసిన మృతురాలి లో దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కేసు దర్యాప్తు కొనసాగుతోందని వివరించారు. మహిళ హత్య కేసును కేవలం 36 గంటల్లోనే ఛేదించి నిందితుడిని పట్టుకున్నామన్నారు. సిఐ కరుణాకర్, ఎస్ఐ లు రవి, శ్రీనివాసరావు, సిబ్బంది మోహన్, అవినాష్, మహేందర్, శ్రీధర్, అనిల్ లను ఏసిపి అభినందించారు.

## ప్రత్యర్థులకు పనిచేసిన కంపెనీకి కాంట్రాక్టులు ఇస్తున్నారు

**గన్నవరం** కూటమి ప్రభుత్వం పై గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సంచలన వ్యాఖ్యలు చేసారు. నా ప్రత్యర్థులతో కలిసి పనిచేసిన పారిశ్రామిక వేత్తలకు పెద్ద పీట వేస్తున్నారని ఆరోపించారు. కేఎంవీ అనే సంస్థకు ఎయిర్ పోర్టు టెర్మినల్ కాంట్రాక్ట్ ఇవ్వడం పై యార్లగడ్డ తీవ్ర అభ్యంతరం తెలిపారు. ప్రత్యర్థులతో యుద్ధం చేస్తే నాకిచ్చే గిఫ్ట్ ఇదేనా. ప్రత్యర్థులకు పనిచేసిన కంపెనీకి కాంట్రాక్టులు ఎలా కట్టబెడతారు.

ఇది క్షమార్హం. నా రెక్కల కష్టం ఖర్చు చేస్తే మీరు నన్ను అవమానాల పాలు చేస్తారా. నా నియోజకవర్గంలో అవినీతి జరిగితే కచ్చితంగా ఎండగడతా .. ఎవరినీ ఉపేక్షించను. నన్ను ఏరోజూ కలవని వారు ఈ రోజు టిడిపి పార్టీ అని చెప్పుకుంటున్నారు.. కోటి , రెండు కోట్ల విరాళాలు ఇచ్చి పనులు చేయించుకునే వారికి చరమగీతం పాడాలి. గన్నవరంలో నా హక్కుల విషయంలో నేను రాజీ పడను. ప్రోటోకాల్ పరంగా నాకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకపోతే ఊరుకునేది లేదు. త్వరలో కార్యకర్తల మీటింగ్ పెడతా ... ఆరోజు అన్నీ మాట్లాడతా. కూటమి నేతలందరినీ ప్రశ్నిస్తున్నా. ఎన్నికల ముందు వచ్చిన వాడు పార్టీనా. అధికారంలోకి వచ్చాక వచ్చిన వాడు పార్టీనా అని నిలదీసారు.

## సంక్షేమ,అభివృద్ధి పథకాలను

# ప్రజల్లోకి తీసుకెళ్లండి

**సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన గురించి వివరించండి**

**డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా మేడ్చల్ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో అభివృద్ధి,సంక్షేమం అన్ని వర్గాల ప్రజలకు అందుతుందన్నారు.మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని మేడ్చల్ డివిజన్ కు చెందిన కనకాల శివ కుమార్ (బిపిటి రాజు) కు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియామక పత్రాన్ని మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్,కిష్టాపూర్ పూడూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి అందజేసి శుభాకాంక్షలు తెలిపిన డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏ ఒక పేద కుటుంబానికి ఒక రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు.కానీ,సీఎం రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి నేటి వరకు రేషన్ కార్డుల పంపిణీ నిరంతరంగా సాగుతుందన్నారు.దీంతో లక్షల మంది పేదలులబ్ధిపొందుతున్నట్టుగా గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ కుమార్ యాదవ్,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు మహమ్మద్ అయూబ్ ఖాన్ (యూసుఫ్), మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు కురుమ, మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, కిష్టాపూర్ పూడూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యులు వెంకట్ రాంరెడ్డి, మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జాకట దేవరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోనె మహేందర్ రెడ్డి, నడికొప్పు రంజిత్ ముదిరాజ్, సింగరేణి పోచయ్య, సద్ది సుదర్శన్ రెడ్డి, పాలకుర్తి రాఘవేందర్ గౌడ్, సద్ది ప్రకాష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ ప్రభుత్వ పాఠశాలల్లో దారుణ నిర్లక్ష్యం

**పరిశుభ్రత, విద్యార్థుల సంక్షేమంపై అధికారుల అలసత్వం**

**- ఆర్డీఓకు అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ఫిర్యాదు**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత, పారిశుధ్యం, మౌలిక వసతుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం నెలకొన్నట్లు అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ఆరోపించింది. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమానికి భంగం కలిగించే పరిస్థితులు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని విమర్శించింది. ఈ నేపథ్యంలో సోమవారం గజ్వేల్ ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరింది.సంస్థ సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు షమీమ్, జిల్లా ఉపాధ్యక్షురాలు రజియా బేగం మాట్లాడుతూ, ఇటీవల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల (జెడ్పీజిహెచ్ఎస్), తెలంగాణ మోడల్ స్కూల్‌లను సందర్శించి పరిశీలించినట్లు తెలిపారు. పాఠశాలల్లో పరిశుభ్రత, పారిశుధ్యం, నిర్వహణలో అనేక లోపాలు కనిపించాయని, ముఖ్యంగా విద్యార్థులు శుభ్రమైన వాతావరణంలో మధ్యాహ్న భోజనం చేసే సదుపాయాలు లేకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు.పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, భోజనశాలలు, పారిశుధ్య వ్యవస్థ వంటి ప్రాథమిక వసతులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సంబంధిత శాఖలు వెంటనే తనిఖీలు నిర్వహించి లోపాలను సరిదిద్ది, విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు రజియా బేగం, కోఆర్డినేటర్ అజర్, హెచ్ఆర్ సంధ్యారాణి, ఆఫీసర్ విమల, ఖాజా బాబా, అబ్దుల్ హకీమ్, మస్యుద్దీన్, రసూల్, యాదమ్మ, స్వరూప, లలిత, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

## 15 వ వార్డులో పర్యటించిన డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి సోమవారం 15వ వార్డులో పర్యటించారు, అందులో భాగంగా ఎస్ ఐ ఆర్ ఓటరు నమోదు హెల్ప్ డెస్క్ సందర్శించి వారు మాట్లాడుతూ ఓటును భద్ర పరచుకే బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని తెలిపారు.అందరూ ప్రత్యేక ఓటు సవరణ కార్యక్రమంలో పాల్గొని ప్రజా స్వామ్యన్ని కాపాడు కోవాలనీ అవగాహన కల్పించారు బి ఎల్ ఓ లకు సహకరించి విజయవంతం చేయాలని తెలిపారు. స్వచ్ఛందంగా సహకరించిన సామాజిక కార్యకర్త సాధాక్ పాషా, బి ఎల్ ఓ బసాడి మమత,నాయకులు కృపనందం,కనక స్వామి లకు శాలువాతో సత్కరించి అభినందిచారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కౌన్సిలర్స్ నక్క సంతోషి రాములు గౌడ్, గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్, టి పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, సీనియర్ నాయకులు వహీద్ ఖాన్,జోగిని లక్ష్మణ్, మహంకాళి చంద్రం, కృపనందం, మహమ్మద్ షకీల్ బాయ్ వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

## బహుళ సాంస్కృతిక దేశంలో

# అంతర్మత సంభాషణ యొక్క ప్రాముఖ్యత

భారతదేశం వంటి విశాలమైన మరియు వైవిధ్యభరితమైన దేశంలో వివిధ మతాలు, భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలకు చెందిన ప్రజలు కలిసి జీవిస్తున్నారు. వారణాసి దేవాలయాల నుండి ఢిల్లీ మసీదుల వరకు, గోవా చర్చిల నుండి అమృతసర్ గురుద్వారాల వరకు ఈ వైవిధ్యం కేవలం కనిపించడమే కాదు, ప్రజల దైనందిన జీవితంలో లోతుగా పాతుకుపోయి ఉంది.అయితే, ఈ వైవిధ్యంతో పాటు కొన్ని సవాళ్లు కూడా ఉంటాయి. పరస్పర అవగాహన లేకపోవడం వల్ల అపోహలు, మూస ధారణలు, కొన్నిసార్లు ఘర్షణలు కూడా తలెత్తుతాయి. ఇలాంటి సందర్భాల్లో అంతర్మత సంభాషణ కేవలం ముఖ్యమైనదే కాదు, అత్యవసరమైనదిగా మారుతుంది. అంతర్మత సంభాషణ అంటే వివిధ మతాలకు చెందిన ప్రజలు కలిసి మాట్లాడటం, వినటం, ఒకరి విశ్వాసాలు మరియు ఆచారాలను మరొకరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం. ఇది ఎవరి మతాన్ని మార్చడం కోసం కాదు లేదా ఒక మతం మరొక మతం కంటే గొప్పదని నిరూపించడం కోసం కాదు. దీని ప్రధాన ఉద్దేశ్యం పరస్పర గౌరవం, విశ్వాసం మరియు శాంతియుత సహజీవనాన్ని పెంపొందించడం.భారతదేశ చరిత్ర కూడా ఇటువంటి సంభాషణ యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. "వైవిధ్యంలో ఏకత్వం" అనే భావన భారత జాతీయ గుర్తింపులో ప్రధాన స్థానాన్ని కలిగి ఉంది. మహాత్మా గాంధీ అన్ని మతాలలోనూ సత్యం ఉందని, వాటిని సమానంగా గౌరవించాలని విశ్వసించేవారు. ఆయన తరచూ వివిధ మతాల ప్రజలతో సంభాషిస్తూ మత సామరస్యాన్ని ప్రోత్సహించారు. అలాగే మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారతదేశ బలం అనేక మతాలు శాంతియుతంగా సహజీవనం చేసే సంయుక్త సంస్కృతిలో ఉందని పేర్కొన్నారు.అంతర్మత సంభాషణ వల్ల కలిగే ముఖ్యమైన ప్రయోజనాలలో ఒకటి భయం మరియు అపోహలను తగ్గించడం. సాధారణంగా ప్రజలు తమకు తెలియని విషయాల పట్ల భయపడతారు. వివిధ మతాల ప్రజలు పరస్పరం కలిసినప్పుడు, వారు ఒకరినొకరు కేవలం మత గుర్తింపుల ద్వారా కాకుండా మనుషులుగా చూడటం ప్రారంభిస్తారు. ఒక హిందువు ముస్లింకు మాట్లాడటం, ఒక క్రైస్తవుడు సిక్కు అభిప్రాయాలను వినడం, ఒక జైనుడు బౌద్ధుడితో సంభాషించడం వంటి సాధారణ పరస్పర చర్యలు ఎన్నో మూస ధారణలను చెరిపివేస్తాయి. ఈ సంభాషణల ద్వారా దయ, నిజాయితీ, కరుణ, మానవత్వం పట్ల గౌరవం వంటి విలువలు అన్ని మతాలలోనూ ఉన్నాయని ప్రజలు గ్రహిస్తారు.నేటి డిజిటల్ యుగంలో తప్పుడు సమాచారం చాలా వేగంగా వ్యాపిస్తోంది. సామాజిక మాధ్యమాలు కొన్నిసార్లు విభజనాత్మక కథనాలను ప్రోత్సహించి సమాజంలో ఉద్రిక్తతలను పెంచగలవు. మత బోధనలపై తప్పుడు ప్రచారం లేదా వక్రీకృత వ్యాఖ్యానాలు పరస్పర అవిశ్వాసానికి దారితీయవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో అంతర్మత సంభాషణ ఒక శక్తివంతమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుంది. సమాజాల మధ్య బలమైన సంబంధాలు ఉన్నప్పుడు ప్రజలు వదంతులను నమ్మే అవకాశాలు తగ్గి, నిజాలను ధృవీకరించే అవకాశం పెరుగుతుంది.అంతర్మత సంభాషణ మరో ముఖ్యమైన పాత్ర తీవ్రవాదం మరియు అతివాద భావజాలాన్ని నిరోధించడంలో ఉంది. ఒంటరితనం లేదా నిర్లక్ష్యం అనుభవించే వ్యక్తులు కొన్నిసార్లు అతివాద సిద్ధాంతాల బారిన పడవచ్చు. సంభాషణ ద్వారా వారు తమ సమస్యలను శాంతియుతంగా వ్యక్తపరచి, నిర్మాణాత్మక పరిష్కారాలను కనుగొనే అవకాశం పొందుతారు. దీనివల్ల వారు హానికర మార్గాల వైపు మళ్లే అవకాశాలు తగ్గుతాయి.అంతర్మత సంభాషణ భారత రాజ్యాంగ విలువలతో కూడా సన్నిహితంగా అనుసంధానమై ఉంది. రాజ్యాంగం ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛను కల్పిస్తూ సమానత్వాన్ని ప్రోత్సహిస్తుంది. అయితే కేవలం చట్టాలు మాత్రమే సామరస్యాన్ని తీసుకురాలేవు. ప్రజల చురుకైన భాగస్వామ్యం కూడా అవసరం. సంభాషణ ద్వారా రాజ్యాంగ విలువలు ఆచరణలోకి వస్తాయి. ఇది ప్రజలను కేవలం సహించడమే కాకుండా, పరస్పరం గౌరవించడానికీ ప్రోత్సహిస్తుంది.అయితే అంతర్మత సంభాషణ ఎల్లప్పుడూ సులభం కాదు. దీనికి సహనం, విశాల దృక్పథం మరియు విభేదాల మధ్య కూడా పరస్పరం వినగలిగే మనస్తత్వం అవసరం. కొన్ని సందర్భాల్లో సంభాషణలు అసౌకర్యంగా అనిపించవచ్చు. అయినప్పటికీ సంభాషణను నివారించడం సమస్యలను మరింత పెంచుతుంది. దీర్ఘకాలిక సామరస్యానికి నిజాయితీతో కూడిన గౌరవప్రదమైన సంభాషణలు అవసరం.అంతర్మత సంభాషణ కేవలం ప్రముఖుల సమావేశాలకు లేదా అధికారిక కార్యక్రమాలకు మాత్రమే పరిమితం కాకూడదు.

ఇది గ్రామాలు, చిన్న పట్టణాలు మరియు నగర ప్రాంతాల వరకు విస్తరించాలి. సాధారణ ప్రజలు పరస్పరం అర్థవంతమైన సంభాషణల్లో పాల్గొన్నప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. మహిళలు, యువత మరియు అణగారిన వర్గాల భాగస్వామ్యాన్ని కూడా నిర్ధారించాలి.అంతర్మత సంభాషణ అనేది కేవలం వైవిధ్యాన్ని నిర్వహించే సాధనం మాత్రమే కాదు; బలమైన మరియు ఐక్య సమాజ నిర్మాణానికి పునాది. భారతదేశం వంటి దేశంలో, అనేక గుర్తింపులు కలిసి జీవిస్తున్నప్పుడు, సంభాషణ భిన్నతలను కలుపుతూ వాటిని బలాలుగా మారుస్తుంది. మన మతాలు వేర్వేరు కావచ్చు, కానీ మన మానవత్వం ఒక్కటే అనే విషయాన్ని ఇది గుర్తుచేస్తుంది. పరస్పరం వినడం, గౌరవించడం, కలిసి పనిచేయడం ద్వారా వైవిధ్యాన్ని భయపడకుండా సంబరంగా స్వీకరించే సమాజాన్ని నిర్మించవచ్చు.

# గతం మోసం, భవిష్యత్తు భరోసా:టీ సర్కార్

- న్యాయం జరిగేనా,గతం పునరావృతం అయ్యేనాలి.?
  ఉద్యమ వీరులకు భరోసా,అర్జీలు స్వీకరన, న్యాయం చేస్తారా.?
- తెలంగాణ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాట యోధులకు
  గౌరవము దక్కేనా.?
- స్థలం,పెన్షన్,గుర్తింపు కార్డు తప్పని సరి అంటున్న ఉద్యమకారులు.
- "40" ,50" పై బడి వయస్సు ఉన్న ఉద్యమకారులు ఉపాధి లేక,
  వివిధ రుగ్మతలతో బాధపడుతూ లోలోపల దిగమింగుకుని జీవచ్ఛవంలా
- బ్రతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2001 లో తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేసిన "ఉద్యమ పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి"ని మాజీ సిఎం కేసిఆర్.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పదమూడు సంవత్సరాలుగా పోరాటం చేస్తే గాని ప్రత్యేక రాష్ట్రం సిద్ధించలేదు.అప్పటి కాంగ్రెస్ పార్టీ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి దివంగత నేత సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం ఉద్యమం కెరటం లా ఎగిసిపడింది.తెలంగాణ అస్తిత్వం కోసం అన్ని వర్గాల ప్రజలు ఉద్యమానికి మద్దతు తెలుపుతూ రోడ్లు ఎక్కారు.వంటావార్పు,మిలినియం మార్చ్,సకల జనుల సమ్మె,రాస్తారోకోలు ర్యాలీలు నిర్వహించారు.ఈ ఉద్యమంలో గ్రామాల నుంచి మొదలు కొని పట్టణాలు సైతం జై తెలంగాణ జై జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు.మరీ ముఖ్యంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించారు.అదే విధంగా "సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఉత్తర తెలంగాణ నాయకులకు తోడై పోరాట యోధులై ముందుకు సాగారు.ఈ క్రమంలో వందల సంఖ్యలో ఉద్యమకారులకు గాయాలయ్యాయి.ఎంతో మందిపై కేసులు నమోదయ్యాయి.అంటే జంటనగరాల్లో రెండోవ స్థానంలో నిలిచి ఉద్యమానికి ఊపిరి పోసిన కంటోన్మెంట్ సైనికులే చెప్పకనే చెబుతున్నాయి వారి పోరాట శైలి.కొందరైతే పోరాట సమయంలో తగిలిన గాయాలు వారిని మనోవేదనకు గురి చేయడమే కాకుండా మరణానికి కారణం అయ్యాయి.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం సుమారు పదిహేను వందల మంది అమరులు అయిన విషయం విదితమే.ఆ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తులు ప్రస్తుతం ఏ ఉపాధి లేక వయస్సు మీద పడి కుటుంబాన్ని పోషించే దారి లేక మనోవేదనకు గురి అవుతున్న తరుణంలో,గత ప్రభుత్వం ఉద్యమకారులకు అన్యాయం చేసిందని"తెలంగాణ రక్షణ సేన"అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గత కొన్ని రోజుల క్రితం ఉప్పల్ భగాయిత్ లో ఉద్యమకారులతో ధర్నా నిర్వహించారు.ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న



తెలంగాణ సర్కార్ యుద్ధప్రాతిపదికన "తెలంగాణ ఉద్యమకారులు కమిటీ"వేసి, దానికి ఛైర్మన్ కె.కేశవరావుని నియమించారు. రాష్ట్రంలోతెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి వ్యక్తి పూర్తి వివరాలు 13/7/2026 అందజేయాలన్నారు. ఈనేపథ్యంలో నిన్న సోమవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన గుర్తింపును ఇవ్వడం కోసం రాష్ట్ర ప్రభుత్వం కె.కేశవరావు ఛైర్మన్ గా కమిటి ఏర్పాటు చేసిన నేపథ్యంలో కంటోన్మెంట్ లోని తెలంగాణ ఉద్యమంలో పోరాడిన ఉద్యమకారులతో కలిసి కమిటి మెంబర్ అయిన ప్రొఫెసర్ కోందండ రామ్ ను కలిసి ఉద్యమకారుల అభ్యర్ధన పత్రాలను ఆయనకు అందజేశారు. గత ప్రభుత్వం ఉద్యమకారుల విషయంలో అన్యాయం చేసిందని అందుకే సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యమకారులందరిని గుర్తించి వారు చేసిన పోరాటానికి, త్యాగాలకు వారికి న్యాయం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు.అందుకే కంటోన్మెంట్ లోని ఉద్యమకారుల అభ్యర్ధన పత్రాలను తానే స్వయంగా తీసుకువెళ్లి కమిటికి అందించానని తెలిపారు. కమిటీ అభ్యర్ధన పత్రాలను పరిశీలించి ఉద్యమంలో వారి భాగస్వామ్యాన్ని గుర్తించి తగిన గుర్తింపును ఇస్తుందన్నారు.

**టిఎమ్మార్పీఎస్ ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ ఇటుక గోపి:**

బితెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై పూర్తి నమ్మకం ఉంది.బి తెలంగాణ ఉద్యమ కారులకు న్యాయం చేస్తారని ఆశ భావం వ్యక్తం చేసిన గోపి. కమిటీ పెద్దలకు అభ్యర్థన పత్రాలు అందజేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ మొన్నటి ప్రభుత్వం చేసిన తప్పిదం ఈ ప్రభుత్వం చేయదనే నమ్మకం కలిపించే నాయకులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డని ఆయన కొనియాడారు. తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటామని తెలంగాణలో ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేస్తే ఉద్యమకారులను ఆత్మగౌరవం కాపాడుతామని అన్ని విధాల ఉద్యమకారులను ఆదుకుంటుందని మేనిఫెస్టో పెట్టినటువంటి విషయాలను స్థలం, భీమా, గుర్తింపు కార్డు ఉద్యమకారులకు అందే విధంగా చేస్తామన్న విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఏర్పాటు చేసినటువంటి సమావేశం అమరవీరుల భవనంలో పాల్గొన్నామన్నారు. ఉద్యమ సందర్భంలో జరిగినటువంటి పరిణామాలను, త్యాగాల విషయంలో మాట్లాడుతూ ఉద్యమకారులకు సరైన గౌరవం దక్కలేదని గత ప్రభుత్వం నిర్లక్ష్యం ఎంతోమంది ఉద్యమకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా విషయన్ని గుర్తు చేశారు.అది పునరావృతం కాకుండా సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకుంటానని ఇచ్చినటువంటి మాట పై ఉంటారన్న నమ్మకంతో ఉద్యమకారులు అందరు అమరవీరుల భవానికి విచ్చేసి ప్రభుత్వము ఏర్పాటు చేసినటువంటి కమిటీ ముందు ఉద్యమకారులు ప్రస్తుతం వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులతో పాటు అన్ని విషయాల పై చర్చించారు. ఈ కార్యక్రమంలో టిఎమ్మార్పీఎస్ ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ ఇటుక గోపి మాదిగబిలి, బుల్లెట్ రవి, సంకీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జిల్లా పరిషత్ మన్నెగూడ పాఠశాల 2000-2001 పదవ తరగతి బ్యాచ్ వారి 25వ సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం వనస్థలిపురంలోని అనన్య ఎకో రిసార్ట్స్‌లో ఆదివారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో సుమారు 70మంది పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు రాములు పాల్గొన్నారు. ఉదయం 10 గంటలకు రిజిస్ట్రేషన్‌తో ప్రారంభమైన కార్యక్రమంలో దీప ప్రజ్వలన, గురువందనం మరియు చనిపోయిన మిత్రులకు మౌనం పాటించి వేడుక నీ ప్రారంభిచారు. రాములు పదవి విరమణ అయినా సందర్భంగా ముఖ్య అతిథిగా వచ్చినందుకు రాములు వారి సతీమణి దంపతులకు పూర్వ విద్యార్థులు మోసిన్, వెంకన్న, శ్రీకాంత్, మల్లేష్, కృష్ణ, లింగయ్య, సురేందర్, ఏసు, ఏడుకొండలు, ప్రసన్న, రాణి, దీప, పార్వతి, ప్రేమలత, అశ్విని, రాధా, ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు స్కూల్ రోజులను గుర్తు చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, గ్రూప్ ఫోటో కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం సమ్మేళనం నిర్వహించాలనీ తీర్మానించారు. ఈ కార్యక్రమాన్ని మోసిన్ మహమ్మద్, వెంకన్న, శ్రీకాంత్, సురేందర్, లింగయ్య, కృష్ణ, వినయ్, పార్వతి, ప్రసన్న, అశ్విని, దీప, రాణి, రాధ, ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మాధవి, శ్వేత, జ్యోతి, సునీత, కవిత, లక్ష్మి, జయమ్మ, శిల్ప, పాండు, యాదయ్య, ఫయుమ్, సురేష్, ప్రవీణ్, శేఖర్, నర్సింహా, గణేష్, మల్లికార్జున్, వాహేద్, రామ్మోహన్, మల్లయ్య, గిరి, మధు, పాల్గొన్నారు.

# శాకంభరీ ఉత్సవానికి శ్రీశైలం సిద్ధం

**40 రకాల ఆకుకూరలు, కూరగాయలతో**

**భ్రమరాంబ అమ్మవారికి విశేష అలంకరణ**

**భక్తులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ**

**ఏర్పాట్లు చేయాలని ఈవో ఆదేశాలు**



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 29న నిర్వహించనున్న శ్రీ భ్రమరాంబ అమ్మవారి శాకంభరీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు శ్రీశైలం దేవస్థానం సన్నాహాలు ప్రారంభించింది. ఉత్సవ ఏర్పాట్లపై సోమవారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, వేదపండితులు, స్థానాచార్యులు, డిప్యూటీ ఈవో, వివిధ శాఖల అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్న సమావేశంలో ఉత్సవ నిర్వహణపై సమగ్రంగా చర్చించారు. లోకకల్యాణం కోసం నిర్వహించే ఈ ఉత్సవంలో అన్ని కైంకర్యాలు శాస్త్రోక్తంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని ఈవో సూచించారు. అమ్మవారి అలంకరణ కోసం సుమారు 40 రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు సమకూర్చాలని ఉద్యానవన శాఖకు ఆదేశించారు. వైదిక కమిటీ సూచనల మేరకు ఏర్పాట్లు చేపట్టాలని చెప్పారు. ఈసారి భక్తులందరికీ దర్శనం సులభంగా కల్పించేందుకు అక్కమహాదేవి అలంకార మండపంలో ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి, మండపంతో పాటు ఆలయ ప్రాంగణం, ద్వారాలను కూడా ఆకుకూరలు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించాలని నిర్ణయించారు. భ్రమరాంబ అమ్మవారితో పాటు రాజరాజేశ్వరి అమ్మవారు, గ్రామదేవత అంకాళమ్మకు కూడా శాకంభరీ అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవం సందర్భంగా భక్తులకు వివిధ కూరగాయలతో తయారు చేసిన కదంబ ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.
ఆషాఢ పౌర్ణమి రోజున భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున దర్శనం, క్యూలైన్లు, భద్రత, ఇతర సౌకర్యాలపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే జూలై 29న అమ్మవారి ఆర్జిత కుంకుమార్చనలను పూర్తిగా నిలిపివేయాలని ఆలయ, ఐటీ విభాగాలకు సూచించారు. సమావేశంలో గురుపౌర్ణమి సందర్భంగా ఆలయంలో నిర్వహించే దక్షిణామూర్తి పూజ, వ్యాసపూజ ఏర్పాట్లపై కూడా అధికారులు చర్చించారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**డిప్యూటీ కమిషనర్ కు వినతి**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మేడ్చల్ మండల కార్యదర్శి ఎం . నరేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కనీస వేతనాలు చట్టం ప్రకారము మున్సిపల్ కార్మికులకు వెంటనే జీతాలు ఇవ్వాలని , గత ఏడు నెలల నుండి ఈఎస్ఐ పీఎఫ్ పేరు మీద కట్ అవుతున్న అమౌంట్లను అకౌంట్లో ఆడ్ చేయలేదని కేవలం ఈనెల మాత్రమే ఆడ్ చేశారని మిగతా 6 నెలల అమౌంట్ ను వెంటనే జమ చేయాలని, కార్మికులకు ఇవ్వాల్సిన మౌలికాక సదుపాయాలను బట్టలు, చెప్పులు, షూస్, కొబ్బరి నూనె, గ్లౌజులు, క్యాపులు, రెయిన్ కోట్లు, సేఫ్టీ బెల్టులు, జాడు కట్టలు తదితర మౌలిక సదుపాయాల వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ఈ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, ఈ ఎస్ ఐ, పి ఎఫ్ కు సంబంధించినటువంటి సమస్య ఎక్కడ ఉందో తెలుసుకొని వెంటనే పరిష్కారం చేస్తామని, కార్మికులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలను 15 రోజుల్లో అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ సర్కిల్ మున్సిపల్ కార్మికులు గుండ్లపోచంపల్లి డివిజన్ మున్సిపల్ అధ్యక్ష కార్యదర్శులు సంతోష్, గణేష్, కోశాధికారి రాజ్ కుమార్, నాయకులు లక్ష్మి, నర్సింగ్, వెంకటేష్, సత్య, పోచమ్మ , నిలమ్మ, నాగమణి, శ్రీకాంత్, మేడ్చల్ డివిజన్ నాయకులు మల్లేష్, నరేష్, మహేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# అమలుకు నోచుకోని జర్నలిస్టుల సంక్షేమ హామీలు

**టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ ముందు ధర్నా**




మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నిర్దిష్టంగా అమలుచేయాలని మీడియా స్వేచ్ఛ కాపాడాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ( టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాపిత పిలుపులో బాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని భారీగా నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఎస్ కె సలీమా, గుమ్మడి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, కార్యదర్శి బనావత్ రవి నాయక్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అర్హులైన వారందరికీ వెంటనే అక్రిడేషన్ ఇవ్వాలని, హెల్త్ కార్డులు, పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయతీలు ఇండ్ల స్థలాల హామీలు అమలు విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవరిస్తుందని అన్నారు. ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని లేందంటే ఆందోళ తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా, నియోజక వర్గం ఇంచార్జ్ లు నాయకులు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం ఆదేశాలకు బిఎల్ఓ ల తిలోదకాలు - అయోమయంలో ఓటర్లు

- బిఎల్ఓ ల బాధ్యతారహిత్యంతో అటుఇటు కాని స్థితిలో ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ
- ముగింపు సమయం ముంచుకొస్తున్న ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ జరగలేదు
- ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలు నమోదు చేయాల్సిన బిఎల్ఓలు తమ భాధ్యతలను గాలికి వదిలేసి అలసత్వం ప్రదర్శించడం విడ్డూరం
-ఎన్నికల సంఘం నిబంధనలపై ఓటర్లలో అవగాహన కల్పింస్తు ఎన్యూమరేషన్ ఫారంలో వివరాల నమోదు ప్రక్రియపై అనుమానాలను నివృత్తి చేయాల్సిన బిఎల్ఓ లు ఎక్కడున్నారు
-అవగాహన లోపంతో ఎన్యూమరేషన్ ఫారం భర్తీ చేయని వారి ఓటుహక్కుకు భాధ్యత ఎవరు వహిస్తారు
-ఆధికారులు వెంటనే స్పందించి ఇంటింటి సర్వేతో ఓటర్ల వివరాలు సేకరించని బిఎల్ఓలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్(ప్రశ్న న్యూస్) దేశ వ్యాప్తంగా భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. అత్యంత పారదర్శకంగా సాగుతున్న ఈ ప్రక్రియలో ఓటర్ల జాబితాలో పేరుండి మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్ళిన వారు, రెండు చోట్లలో ఓటు ఉన్నవారిని తొలగించడమే ప్రధాన లక్ష్యంగా జరుగుతున్న ఈ ప్రక్రియలో అనేక అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా ఈ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రధాన పాత్ర పోషించే బూత్ లెవల్ అధికారుల (బిఎల్ఓ) అలసత్వం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం తమకు కేటాయించిన ప్రాంతాల్లో ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల అనుమానాలను నివృత్తి చేస్తు ఎన్యూమరేషన్ ఫారం అందించి అందులో వివరాలను ఎలా నమోదు చేయాలనే అంశంపై ఓటర్లలో అవగాహన కల్పించాల్సి ఉండగా దీనికి విరుద్ధంగా బిఎల్ఓలు ఒకే చోట కూర్చుని అక్కడికి వచ్చిన వారికి మాత్రమే ఎన్యుమరేషన్ ఫారాలు ఇస్తుండడంతో అనుకున్నంత మేరకు ఫామ్స్ పంపిణీ కాక పోవడం గమనార్హం. ఇప్పటికే గడవు ముగిసే సమయం ముంచుకొస్తున్న తరుణంలో కేవలం 30-40 శాతం ఓటర్లు మాత్రమే ఎన్యూమరేషన్ ఫామ్స్ సమర్పించారు. మరి మిగిలిన ఓటర్ల పరిస్థితి ఏంటనే ప్రశ్న తలెత్తుతోంది. ముఖ్యంగా గత 2002 సంవత్సర ఓటర్ జాబితాలో ఉన్న సమాచారం సేకరించడం, వాటిని ఎన్యూమరేషన్ ఫారాల్లో నమోదు చేయడం వంటి అంశాలపై ఓటర్లకు అవగాహన కల్పించాల్సిన బిఎల్ఓలు తమ బాధ్యతలను విస్మరించి అలసత్వం ప్రదర్శించడంతో ఎంతో మంది ఓటర్ల తమ ఓటుహక్కును కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని ఆందోళనలు వెల్లువెత్తాయి. అయితే కొంత మంది ఓటర్లు మాత్రం తమ వివరాలను ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకున్నాను సర్వర్ల కారణంగా తమ దరఖాస్తులు అప్ లోడ్ కాకపోవడం గమనార్హం. అయితే రానున్న ఓటర్ల జాబితాలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశముంది. మరోపక్క 2002 సంవత్సర ఓటరు జాబితాలోని వివరాలను నమోదు చేయాలనే నిబంధనలు మరింత గందరగోళానికి






కారణమవుతున్నాయి. అప్పటి ఎపిక్ నెంబర్ల వివరాలు మ్యాచ్ కాకపోవడంతో అప్ లోడ్ చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు ఓటర్లు గగ్గోలుపెడుతున్నారు. అయితే ఫామ్స్ లో వివరాలు నమోదు చేయడంలో తలెత్తే ఇబ్బందులను నివృత్తి చేసేందుకు అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో ఓటర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2002 ఓటర్ వివరాలను నమోదు చేయకున్నా భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని చెబుతున్నప్పటికీ ఓటర్లలో ఆందోళన వ్యక్తం అవుతోంది. అయితే దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించి వారిని అప్రమత్తం చేస్తు వారి ఓటు హక్కును పదిలం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.
అలాగే 2002 సంవత్సరంలో ఓటరుగా నమోదు కానివారు ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవడానికి ఏఏ డాక్యుమెంట్లు అవసరం అవుతాయనే విషయంపై స్పష్టత రావాల్సి ఉందని కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## భాధ్యతలు విస్మరించిన బిఎల్ఓ లు

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రధాన భూమిక పోషించే బిఎల్ఓల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం నత్తనడకగా సాగుతోంది. బిఎల్ఓలకు కేటాయించిన ప్రాంతాల్లో వారు విధిగా ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలను ఇచ్చి వాటిలో నమోదు చేయాల్సిన వివరాలపై అవగాహన కల్పించాలి. కాని వారానికి ఒకసారి మాత్రమే క్షేత్రస్థాయిలో పర్యటించి అది కూడా తమకు అనుకూలమైన స్థలంలో తిష్టా వేసి కాలక్షేపం చేయడం వల్ల ఈ ప్రక్రియ ఎటు వెళుతుందో అనే ఆందోళన నెలకొందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక ఫారాల్లో వివరాలు నమోదు చేసే సమయంలో బిఎల్ఓ ల సహాయం కోసం ఫోన్ ద్వారా సంప్రదించగా వారి నుండి ఎలాంటి స్పందన లేక పోవడం దురదృష్టకరం.
ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బిఎల్ఓ ల పనితీరును సమీక్షించి వారిచే భాధ్యతాయుతంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే ఎంతో సమయం గడిచిపోయి మూగింపు సమయం దగ్గర పడుతున్న తరుణంలో అధికారులు స్పందించి బిఎల్ఓ లను ప్రతి ఇంటికి వెళ్ళి ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియ, కొత్తగా నమోదయే ఓటర్ల అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ ఓటర్ల ఓటుహక్కును కాపాడుకునేలా చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఓటర్లు కోరుతున్నారు.

# ప్రభుత్వ భూమిని కాపాడండి

-పోలీస్ స్టేషన్, ఆసుపత్రి,ప్లేగ్రౌండ్ స్థలం కబ్జా
- తక్షణమే స్వాధీనం చేసుకుని అభివృద్ధి పనులు ప్రారంభించాలి.
- మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ కి సోషల్ జస్టిస్ పార్టీ వినతి.

ఎల్బీనగర్ (ప్రశ్న న్యూస్) పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి ,ప్లే గ్రౌండ్ కోసం కేటాయించిన 100 కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతుందని అధికారులు తక్షణమే స్వాధీనం చేసుకుని అభివృద్ధి పనులు ప్రారంభించారని కోరుతూ సోషల్ జస్టిస్ పార్టీ ప్రతినిధులు సోమవారం నాడు మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. సోమవారం నాడు సోషల్ జస్టిస్ పార్టీ సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ మహర్షి, కార్యదర్శి బాలస్వామి బాలాపూర్ ,హైడ్రా ఏరియా ఇన్ చార్జ్ వరంగల్ రమేష్, మల్కాజ్గిరిరి మున్సిపల్ ఏరియా ఇన్చార్జ్ రాపాక వెంకట్ తదితరులు కలెక్టరేట్ కార్యాలయంలో, మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022లో ఫతుల్ల గూడ , బండ్లగూడ సర్వేనెంబర్ 58 ,38/6లో మూడు ఎకరాల స్థలాన్ని నాగోల్ పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి ప్లే కి రోడ్డు కోసం కేటాయిస్తూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారని కమిషనర్కు వివరించారు. అనంతరం ఉప్పల్ తహసిల్దార్ లచ్చిరెడ్డి ఎసిపి



జానకి రామ్ రెడ్డికి నాగోల్ పోలీస్ స్టేషన్కు కేటాయించిన భూమి సరిహద్దులు కేటాయిస్తూ భూమి కూడా స్వాధీనం అప్పగించారని చెప్పారు దాదాపు 100 కోట్ల రూపాయల విలువైన ఈ మూడెకరాల ప్రభుత్వ స్థలంపై కొందరు కబ్జాదారులు నకిలీ డాక్యుమెంట్ సృష్టించి కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వారు కమిషనర్ కు వివరించారు. తక్షణమే భూమిని స్వాధీనం చేసుకుని సరిహద్దులు నిర్ణయించి అందులో



అభివృద్ధి పనులు ప్రారంభించాలని కమిషనర్ ఉదయ్ కృష్ణారెడ్డిని సోషల్ జస్టిస్ పార్టీ నేతలు కోరారు.

# ఇస్నాపూర్, ముత్తంగి, చిట్కుల్ లేఅవుట్లలో రిజిస్ట్రేషన్లు వెంటనే ప్రారంభించాలి

**– ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి**

పటాన్చెరు (ప్రశ్న న్యూస్) ఇస్నాపూర్, ముత్తంగి, చిట్కుల్ గ్రామాల్లో స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులకు కేటాయించిన భూముల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు లేఅవుట్లు ఏర్పాటు చేయబడ్డాయని ఈ లేఅవుట్లలో ఒక్కోటి సుమారు 500 ప్లాట్లతో అభివృద్ధి చేయబడగా, నిర్మాణదారులు ప్రస్తుతం బహుళ అంతస్తుల భవనాలు, వ్యక్తిగత గృహాలను నిర్మించామని తెలిపారు. అయితే, ఇటీవల ఈ లేఅవుట్లలో నిర్మించిన అపార్ట్మెంట్ల ఫ్లాట్లు, ఇండివిడ్యువల్ ఇళ్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో నిర్మాణదారులు, లేఅవుట్ యజమానులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ విషయమై పటాన్చెరు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించగా, ప్రభుత్వం నుంచి వచ్చిన నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్లు నిలిపివేసినట్లు అధికారులు తెలిపారని పేర్కొన్నారని . అయితే, ఆ నిబంధనలు ఏమిటి? ఏ ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారనే విషయంపై స్పష్టత ఇవ్వాలని కోరినా పటాన్చెరు సబ్ రిజిస్టర్ అధికారులు సమాధానం ఇవ్వలేదని నిర్మాణదారులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఈ అంశంపై స్పష్టత ఇవ్వాలని, సంబంధిత ఉత్తర్వులను బహిర్గతం చేయాలని, రిజిస్ట్రేషన్లు ఎందుకు నిలిపివేశారో ప్రజలకు తెలియజేయాలని నిర్మాణదారులు డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో అమ్మకాలు, కొనుగోళ్లు పూర్తిగా స్తంభించిపోయాయని, నిర్మాణాల కోసం బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద నుంచి అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలను చెల్లించే పరిస్థితి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో చేతికి రావాల్సిన నిధులు అందక వడ్డీ భారం రోజురోజుకూ పెరుగుతోందని, పలువురు నిర్మాణదారులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారని తెలిపారు. ఈ పరిస్థితి కారణంగా కొంతమంది కుటుంబాల్లో జరగాల్సిన శుభకార్యాలు, ముఖ్యంగా కుమార్తెల



వివాహాలు కూడా వాయిదా పడినట్లు వెల్లడించారు. ఇదే పరిస్థితి మరికొంతకాలం కొనసాగితే అనేక మంది నిర్మాణదారులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, రిజిస్ట్రేషన్ల నిలిపివేతపై పూర్తి వివరాలు వెల్లడించి, సమస్యను పరిష్కరించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పునరుద్ధరించాలని నిర్మాణదారులు విజ్ఞప్తి చేశారు. అలాగే వేలాది మంది కొనుగోలుదారులు, నిర్మాణదారులు, కార్మికుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేసారు



### తండ్రి కష్టాలను గుర్తుచేసుకున్న

# భాగ్యశ్రీ బోర్సే

'లెనిన్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి భాగ్యశ్రీ బోర్సే. తాజాగా చిన్ననాటి జీవితంలోని కష్టాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేసింది. తాను పుట్టిన వెంటనే తండ్రి ఉద్యోగం కోల్పోయారని, ఆ తర్వాత కుటుంబం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెప్పింది. తమది దిగువ మధ్యతరగతి కుటుంబమని, చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు తమ కోసం ఎంత కష్టపడ్డారో కళ్లారా చూశానని తెలిపింది. ఇంట్లో ప్రతి రూపాయిని ఎంతో జాగ్రత్తగా ఖర్చు చేసేవారని భాగ్యశ్రీ చెప్పింది. రూ.10 పచ్చిమిర్చి, రూ.10 పాలకూర కొనుగోలు చేసిన వివరాలనూ నోట్‌బుక్‌లో రాసుకునేవారని, ఒక వారం రూ.300 ఖర్చయితే తర్వాతి వారం ఎలా గడపాలా అని తల్లిదండ్రులు ఆలోచించేవారని గుర్తు చేసుకుంది. చిన్నతనంలో డబ్బు విలువ తెలియకపోయినా, పెరిగేకొద్దీ తల్లిదండ్రుల కష్టాలు అర్థమయ్యాయని వివరించింది. తన జీవితంలో ఎన్నటికీ మర్చిపోలేని ఓ సంఘటనను భాగ్యశ్రీ గుర్తు చేసుకుంది. "నాకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.. దయచేసి నాకు ఉద్యోగం ఇవ్వండి" అంటూ తన తండ్రి ఒకరి వద్ద వేడుకున్నారని తెలిపింది. చిన్న వయసులో తండ్రిని ఆ స్థితిలో చూడటం చాలా బాధ కలిగించిందని చెప్పింది. అప్పుడే ఆయన మళ్లీ ఎప్పుడూ అలాంటి పరిస్థితిని ఎదుర్కోకూడదని నిర్ణయించుకున్నానని, జీవితంలో తాను సాధించాలనుకున్న ప్రతి లక్ష్యం వెనుక తల్లిదండ్రులే ప్రేరణగా ఉన్నారని వెల్లడించింది.

ఔరంగాబాద్‌కు చెందిన భాగ్యశ్రీ బోర్సే కొంతకాలం నైజీరియాలో చదువుకుని, తర్వాత ముంబైలో మోడలింగ్ ప్రారంభించింది. బాలీవుడ్‌లో చిన్న పాత్రలతో కెరీర్ ప్రారంభించిన ఆమెకు రవితేజ సరసన నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. అనంతరం విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్, రామ్ పోతినేని వంటి హీరోలతో నటించింది. ఇటీవల అఖిల్ అక్కినేని సరసన నటించిన 'లెనిన్' సినిమాతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

# చోర శికామణులు



రామ్‌తేజ్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్, నరేష్, సంపూర్ణేష్‌బాబు ముఖ్య తారలుగా తెరకెక్కుతున్న యాక్షన్ క్రైమ్ కామెడీ థ్రిల్లర్ 'చోర శికామణులు'. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం ఆనంద్ కూర్మా. బానూరు నాగరాజు నిర్మాత. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. నిర్మాతలు వి.దామోదరప్రసాద్, టి.ప్రసన్నకుమార్, ప్రముఖ దర్శకుడు త్రినాథరావు నక్కిన కలిసి స్క్రిప్ట్‌ని దర్శకునికి అందించారు. ముహూర్తపు సన్నివేశానికి త్రినాథరావు నక్కిన గౌరవ దర్శకత్వం వహించారు. ఈ నెల 25 నుంచి పాట చిత్రీకరణతో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఆనంద్ రాజవిక్రమ్.



# తెగించి తీసుకున్న నిర్ణయమిది

అస్తిత్వం, ఆత్మాభిమానం విషయాల్లో సమంత అస్సలు రాజీపడరు. 'విజయాన్ని సాధించాల్సింది వ్యక్తి మాత్రమే. ఆ వ్యక్తి ఆడా, మగా అనేది వ్యవస్థలో అనవసరం. అసలు ఆ ఆలోచనే అర్థరహితం' అంటారు సమంత. ఆమె తాజా చిత్రం 'మాఇంటి బంగారం' రూ.100 కోట్ల వసూళ్లు దాటింది. టాలీవుడ్‌లో ఈ క్రెడిట్ సాధించిన తొలి మహిళాప్రధాన చిత్రమిదేనని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా ఈ సినిమా విడుదలకు ముందు జరిగిన ఓ సంఘటనను సామ్ తన ఇన్‌స్టా ద్వారా పంచుకున్నారు. "'మాఇంటి బంగారం' విడుదలకు ముందు అసలు ఈ సినిమా గురించి ఎవరైనా మాట్లాడుకుంటారా? మా ప్రయత్నం ప్రేక్షకులకు చేరుతుందా? అని ఆలోచించాం. ఇందులో భాగంగా ఓ ఎగ్జిబిటర్‌కి నా స్నేహితుడు ఫోన్ చేసి ' 'మాఇంటి బంగారం' గురించి జనాల్లో ఆసక్తి ఉందా? అసలు డబ్బులు వస్తాయంటారా?' అనడిగాడు. 'ఆ.. హీరోయిన్ సినిమాలను ఎవరు చూస్తారండీ.. ఎవరైనా పెద్ద హీరో పక్కన నటిస్తే ఓకే. ఎందుకంటే ఆమె అందంగా ఉంటుంది.. అందరికీ తెలుసు. కానీ ఆమే అంతా అంటే ఎవరొస్తారు చెప్పండి!?' అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడాడు ఆ ఎగ్జిబిటర్. ఆ మాటలు నేను వింటున్నట్టు అతనికి తెలీదు. నిజానికి ఈ అభిప్రాయం అతనిది మాత్రమే కాదు. చాలామందిలో ఇదే అభిప్రాయం ఉంది. మార్పు రావాలంటే తెగించి, ధైర్యంగా నిర్ణయం తీసుకోవాలి. నేను తీసుకున్నాను.. సఫలీకృతమయ్యాను. ఇది ఓ గొప్ప మార్పుకు నాంది అవుతుందని భావిస్తున్నా. ఇకనుంచి మహిళా ప్రధాన చిత్రాలను ఎవరూ తక్కువచేసి మాట్లాడకూడదు. మాట్లాడరని ఆశిస్తున్నా' అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు సమంత.

### కథలో ఎమోషన్స్

# ఆకట్టుకుంటాయి




'తాతయ్య సూపర్‌స్టార్ కృష్ణ నాకు దేవుడు. బాబాయ్ మహేశ్ నన్నెంతో సపోర్ట్ చేస్తున్నారు. టీజర్, ట్రైలర్ చూసి అభినందించారు. నాన్న ఉండుంటే బావుండేది. అజయ్‌భూపతి అద్భుతమైన కథ రాశారు. అందులో ఎమోషన్స్ మిమ్మల్ని ఆకట్టుకుంటాయి. సాంకేతికంగా కూడా సినిమా అద్భుతంగా ఉంటుంది. థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది. లెజెండరీ యాక్టర్ మోహన్‌బాబుతో కలిసి నటించడం గొప్ప అనుభవం. ఇది నా తొలి సినిమా అయినా ఇంతటి అభిమానం చూపిస్తున్న మీ అందరికీ థ్యాంక్స్' అని సూపర్‌స్టార్ కృష్ణ మనవడు ఘట్టమనేని జయకృష్ణ అన్నారు. ఆయన్ను హీరోగా పరిచయం చేస్తూ అజయ్‌భూపతి తెరకెక్కిస్తున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని కథానాయిక. మోహన్‌బాబు పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. పి.కిరణ్ నిర్మాత. అగ్ర నిర్మాత సి.అశ్వనీదత్ సమర్పకుడు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఘట్టమనేని జయకృష్ణ మాట్లాడారు. డైరెక్టర్ అజయ్ భూపతి మాట్లాడుతూ 'ఈసినిమాలో జయకృష్ణ, రాషా తడానీ జంట కన్నుల పండుగగా ఉంటుంది. యాక్షన్ మోడ్‌లో సాగే ఈ సినిమాలో అద్భుతమైన ప్రేమకథ కూడా ఉంటుంది. ఇందులో జయకృష్ణ నటన ఘట్టమనేని అభిమానులు పండుగ చేసుకునేలా ఉంటుంది' అని నమ్మకంగా చెప్పారు. ఈ సినిమాలో నటించడం పట్ల కథానాయిక రాషా తడానీ ఆనందం వెలిబుచ్చింది. ఇంకా చిత్రబృందంతోపాటు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, ఏపీ రాజకీయ ప్రముఖులు కేసినేని చిన్ని, బొండా ఉమ కూడా మాట్లాడారు.

# మహాభారతం చదవండి..

## కల్కి పార్ట్ 2 కోసం వెయిట్ చేయండి..

**- నాగ్ అశ్విన్ స్ట్రాంగ్ కౌంటర్!**



పాన్ ఇండియా దర్శకుడు నాగ్ అశ్విన్ సాధారణంగా సోషల్ మీడియాలో వివాదాలకు దూరంగా ఉంటారు. అయితే తన బ్లాక్‌బస్టర్ చిత్రం కల్కి 2898 ఏడీ పై గత కొద్ది రోజులుగా వస్తున్న విమర్శల నేపథ్యంలో ఆయన తొలిసారి మౌనం వీడి స్పందించారు. ముఖ్యంగా అఖిల్ అక్కినేని నటించిన 'లెనిన్' సినిమా విడుదలైన తర్వాత మొదలైన పోలికలు, కర్ణుడి పాత్రపై వస్తున్న కామెంట్లకు నాగ్ అశ్విన్ తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. జూలై 10న విడుదలైన అఖిల్ అక్కినేని 'లెనిన్' సినిమా బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకెళ్తోంది. ఈ చిత్రంలో కన్నడ నటుడు ప్రమోద్ పంజు పోషించిన వసంత్ పాత్రకు ప్రేక్షకుల నుంచి విశేష ప్రశంసలు లభిస్తున్నాయి. ఆయన నటనను కొనియాడుతూ ఓ నెటిజన్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఆ పోస్ట్‌లో సిల్వర్ స్క్రీన్‌పై కర్ణుడి పాత్రను ఇలా చూపించాలి అని పేర్కొనడంతో, కొందరు నెటిజన్లు 'కల్కి 2898 ఏడీ'లో కర్ణుడి పాత్ర చిత్రీకరణపై విమర్శలు చేయడం ప్రారంభించారు. సినిమాలో కర్ణుడిని అతిగా గ్లోరిఫై చేశారని, మహాభారతంలోని అసలు కథకు భిన్నంగా కొన్ని అంశాలను చూపించారని సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. వివాదం రోజురోజుకూ పెరగడంతో, ఇంతకాలం స్పందించని నాగ్ అశ్విన్ ఎట్టకేలకు సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ప్రముఖ ఆర్థికవేత్త, రచయిత వివేక్ దేబ్‌రాయ్ ఆంగ్లంలో అనువదించిన మహాభారతం పుస్తకంలోని ఒక పేజీని షేర్ చేస్తూ విమర్శలకు సమాధానం ఇచ్చారు. ఆ పోస్ట్‌లో ఆయన, ఇవి ద్రోణ వధ పర్వంలో అర్జునుడితో శ్రీకృష్ణుడు చెప్పిన మాటలు. దయచేసి మహాభారతం చదవండి. ముఖ్యంగా వివేక్ దేబ్‌రాయ్ అనువాదాన్ని చదవాలని నేను సూచిస్తున్నాను అని పేర్కొన్నారు. అంతేకాదు, శ్రీకృష్ణుడు అర్జునుడి ఎదుట కర్ణుడిని ఎన్నిసార్లు ప్రశంసించాడో ఒకసారి తెలుసుకోండి. మన చరిత్రపై నాకు ఎంతో గౌరవం ఉంది. నేను ఏం చేస్తున్నానో నాకు పూర్తిగా తెలుసు. 'కల్కి పార్ట్ 2' కోసం వేచి ఉండండి అంటూ నాగ్ అశ్విన్ ధీమాగా స్పందించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా "వెయిట్ ఫర్ పార్ట్ 2" అనే ఒక్క మాటతోనే సీక్వెల్‌పై అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచేశారు 'కల్కి 2898 ఏడీ' మొదటి భాగంలో ప్రభాస్ నటన, విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు, సంతోష్ నారాయణన్ అందించిన నేపథ్య సంగీతం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అయితే కర్ణుడి పాత్రను ఎలా చూపించారనే అంశంపై అప్పటి నుంచే కొంత చర్చ కొనసాగుతోంది. తాజాగా 'లెనిన్' సినిమా తర్వాత ఆ చర్చ మళ్లీ తెరపైకి రావడంతో నాగ్ అశ్విన్ నేరుగా స్పందించారు. నాగ్ అశ్విన్ ఇచ్చిన సమాధానం తర్వాత ఇప్పుడు సోషల్ మీడియాలో అభిమానులు విస్తృతంగా చర్చిస్తున్నారు. రెండో భాగంలో కర్ణుడి పాత్రకు మరింత ప్రాధాన్యం ఉంటుందా? మహాభారతానికి సంబంధించిన మరిన్ని అంశాలను ఎలా చూపించబోతున్నారు? అనే అంశాలపై ఆసక్తి వ్యక్తమవుతోంది.

# 'లెనిన్'పై మెగాస్టార్ ప్రశంసలు..

## అఖిల్ నాకు మరో కొడుకులాంటి వాడన్న చిరంజీవి

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన 'లెనిన్' చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు రాబడుతూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖుల నుంచి ప్రశంసల వెల్లువ కొనసాగుతోంది. తాజాగా మెగాస్టార్ చిరంజీవి కూడా చిత్రబృందాన్ని ప్రశంసించారు.

ఆయన సోషల్ మీడియా వేదికగా 'లెనిన్' యూనిట్‌ను అభినందిస్తూ ఒక సందేశాన్ని పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'లెనిన్' చిత్రంపై అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని, ఈ విషయం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని చిరంజీవి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఒక సినిమా విజయం సాధించడమే కాకుండా, అందరి నుంచి గొప్ప ప్రశంసలు అందుకోవడం మరింత సంతోషాన్నిచ్చే విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విజయం సందర్భంగా చిత్రబృందం మొత్తానికి ఆయన తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా అఖిల్ అక్కినేని నటన గురించి చిరంజీవి ప్రత్యేకంగా ప్రస్తావించారు. "అఖిల్ నాకు మరో కొడుకులాంటి వాడు. ప్రతి సినిమాతో నటుడిగా మరింత పరిణతి సాధిస్తూ, ఎదుగుతున్న అతడిని ఇలా చూడటం చాలా ఆనందంగా ఉంది" అంటూ మెగాస్టార్ ప్రశంసలు కురిపించారు. ఈ భారీ విజయం అఖిల్ కెరీర్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేర్చడానికి నాంది కావాలని ఆకాంక్షించారు. అలాగే, తన చిరకాల మిత్రుడు నాగార్జునకు కూడా చిరంజీవి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అక్కినేని కుటుంబానికి ఇంతటి ఆనందాన్ని అందించిన ఈ విజయం వెనుక ఉన్న





ప్రతి ఒక్కరూ ప్రశంసలకు అర్హులని అన్నారు. దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు, కథానాయిక భాగ్యశ్రీ బోర్సే, నిర్మాతలు, ఇతర సాంకేతిక నిపుణులకు కూడా శుభాకాంక్షలు తెలియజేశారు. అయితే, తాను ఇంకా 'లెనిన్' చిత్రాన్ని చూడలేదని, ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన చూశాక సినిమా చూడాలనే ఆసక్తి మరింత పెరిగిందని చిరంజీవి వెల్లడించారు. త్వరలోనే ఈ చిత్రాన్ని చూస్తానని పేర్కొన్నారు. బాక్సాఫీస్ వద్ద 'లెనిన్' ఇదే విజయ పరంపరను కొనసాగించి మరిన్ని రికార్డులు సృష్టించాలని ఆయన ఆకాంక్షించారు. చిరంజీవి చేసిన ఈ పోస్ట్‌తో మెగా, అక్కినేని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# విశాఖ విషాదంపై జగన్‌కు మాట్లాడే అర్హత లేదు:మంత్రి కొల్లు రవీంద్ర

**మత్స్యకారుల కోసం కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది: మంత్రి**

**టీడీపీ కార్యాలయంలో వైసీపీ పాలనపై తీవ్ర విమర్శలు**




మంగళగిరి (ప్రశ్న న్యూస్) విశాఖ సముద్ర ప్రమాదాన్ని సైతం రాజకీయాలకు వాడుకోవాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, మత్స్యకారుల కోసం ఐదేళ్ల పాలనలో కనీసం ఒక్క పడవ, ఒక్క ఇంజిన్, ఒక్క వల కూడా ఇవ్వని ఆయనకు ఇప్పుడు పరామర్శల పేరుతో వెళ్లే నైతిక హక్కు లేదని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో విమర్శించారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ సముద్రంలో జరిగిన పడవ ప్రమాదం సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నేవీ, కోస్ట్‌గార్డ్‌తో కలిసి యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. కోస్ట్‌గార్డ్ నివేదిక, అధికారుల ధృవీకరణ ఆధారంగా మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు కేవలం 72 గంటల్లోనే ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించడం దేశంలోనే అరుదైన విషయమన్నారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన మత్స్యకారుడికి తక్షణ సాయం అందించడంతో పాటు కొత్త పడవను కూడా ప్రభుత్వమే సమకూర్చుతుందని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సముద్ర ప్రమాదాల్లో మరణించిన 63 మంది మత్స్యకారుల కుటుంబాలకు మరణ ధ్రువీకరణ పత్రాలు, ఎక్స్‌గ్రేషియా కూడా అందలేదని ఆరోపించారు.

# ఏటూరునాగారంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాలు ప్రారంభం

**- బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం - మీసేవ ద్వారా రిజిస్ట్రేషన్**

**- 2వ, 3వ సంవత్సరం ఫీజులు ఆగస్టు 7లోగా చెల్లించాలని కోఆర్డినేటర్ సూచన**



ఏటూరునాగారం,(ప్రశ్న న్యూస్) ఉద్యోగంతో పాటు ఉన్నత విద్యను కొనసాగించాలనుకునే వారికి శుభవార్త. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలు ఏటూరునాగారంలో ప్రారంభమయ్యాయి. ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ ద్వారా ఈ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ బి. రేణుక తెలిపారు.

### ఏ కోర్సుల్లో ప్రవేశాలు ఉన్నాయి.?

ఈ విద్యా సంవత్సరం బ్యాచ్‌లో బీఏ, బీకాం, బీఎస్సీ వంటి సాధారణ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు లేదా తత్సమాన అర్హత కలిగిన అభ్యర్థులు ఈ కోర్సులకు అర్హులు.

అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను సమీప మీసేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది.

### ఎవరికి ఉపయోగం.?

ఆర్థిక కారణాల వల్ల గానీ, ఉద్యోగ బాధ్యతల వల్ల గానీ రెగ్యులర్ విద్యను కొనసాగించలేని వారికి ఓపెన్ యూనివర్సిటీ ఒక వరమని డాక్టర్ రేణుక అన్నారు. "ఇంటి వద్దే ఉండి, స్వీయ అధ్యయనం ద్వారా డిగ్రీ పూర్తి చేసుకునే అవకాశం ఇది. గృహిణులు, ఉద్యోగులు, దూర ప్రాంత విద్యార్థులకు ఇది మంచి అవకాశం" అని ఆమె వివరించారు.

### 2వ, 3వ సంవత్సరం విద్యార్థులకు ముఖ్య గమనిక..

ఇప్పటికే డిగ్రీ 2వ మరియు 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమ సెమిస్టర్ ఫీజు, పరీక్ష ఫీజు, ట్యూషన్ ఫీజును ఆగస్టు 7, 2026లోగా తప్పనిసరిగా చెల్లించాలని కోఆర్డినేటర్ సూచించారు. ఆలస్య రుసుము లేకుండా నిర్ణీత తేదీలోగా సమీప మీసేవ కేంద్రాల ద్వారా ఫీజు చెల్లింపులు పూర్తి చేసుకోవాలని తెలిపారు.

### సంబంధించిన నెంబర్లు..

ప్రవేశాలకు సంబంధించిన మరిన్ని వివరాలకు, దరఖాస్తు ప్రక్రియపై సందేహాల నివృత్తికి విద్యార్థులు కళాశాల కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. హెల్ప్‌లైన్ నంబర్లు: 7382929825, 9491317887, 8500178217. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్య ద్వారా తమ జీవితాల్లో ముందుకు సాగాలని కోఆర్డినేటర్ డాక్టర్ బి. రేణుక విద్యార్థులకు పిలుపునిచ్చారు.

# దానయ్య కుటుంబానికి టీడీపీ రూ.10 లక్షల సాయం

**- ప్రమాద ఘటనను తారుమారు చేస్తే చట్టం ఉపేక్షించదుం**

**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**- మాజీ మంత్రి సిదిరి అప్పలరాజుపై తీవ్ర విమర్శలు**



శ్రీకాకుళం(ప్రశ్న న్యూస్) మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు కుమారుడు అరవ్‌కు సంబంధించినట్లు ఆరోపణలు వచ్చిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెల కాపరి దానయ్య కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరపున రూ.10 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. సోమవారం ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దానయ్య కుటుంబ పరిస్థితి అత్యంత హృదయవిదారకంగా ఉందన్నారు. ఇద్దరు చిన్నారులు, భార్య, వృద్ధ తల్లితో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తరపున ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాద ఘటనలో వాస్తవాలను తారుమారు చేసి, మరొకరిని కేసులో ఇరికించే ప్రయత్నం జరిగిందనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని మంత్రి అన్నారు. ఈ వ్యవహారంపై చట్టపరమైన చర్యలకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. పోలీసు దర్యాప్తులో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయని, చట్ట ప్రకారమే తదుపరి చర్యలు కొనసాగుతాయని చెప్పారు. రాష్ట్రంలో జరిగే ప్రతి అంశంపై నీతులు చెప్పే మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు, తన కుటుంబానికి సంబంధించిన ఘటనలో మాత్రం భిన్నంగా వ్యవహరించడం విచారకరమని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన పలు ఘటనలను ప్రస్తావిస్తూ ఆ పార్టీపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గమనిక: పై కథనం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేసిన ఆరోపణలు, ప్రకటనల ఆధారంగా రూపొందించబడింది. ఈ ఆరోపణలపై మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు లేదా వైఎస్సార్‌సీపీ స్పందన ఈ ప్రకటనలో లేదు.

# శ్రీ వివేకానంద పాఠశాలలో ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

**- విద్యార్థులకు నులిపురుగుల మాత్రల పంపిణీ, ఆరోగ్యంపై అవగాహన**

**- 19 ఏళ్లలోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరి: ఆశా వర్కర్ సూచన**



ఏటూరునాగారం,( ప్రశ్న న్యూస్) విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకులవారి ఘనపూర్ లో ఉన్న శ్రీ వివేకానంద విద్యానికేతన్ పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 1 నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సు గల విద్యార్థి, విద్యార్థినులందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసి, అక్కడికక్కడే వేయించారు. పిల్లల ఆరోగ్యం, పోషకాహార స్థితిపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆశా వర్కర్ సీహెచ్ నాగమణి, స్థానిక వార్డు సభ్యుడు నగవత్ కిరణ్ హాజరై విద్యార్థులకు మాత్రలు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ పెండ్యాల ప్రభాకర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా, పాఠశాల ఇన్‌చార్జి అశ్విని జ్యోతి మొత్తం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

### మాత్రల వల్ల కలిగే ప్రయోజనాలు..

ఈ సందర్భంగా ఆశా వర్కర్ సీహెచ్ నాగమణి మాట్లాడుతూ, "నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, బలహీనత, పోషకాహార లోపం వస్తుంది. నులిపురుగుల నివారణ మాత్రలు ప్రతి 6 నెలలకు ఒకసారి తీసుకోవడం వల్ల శరీరానికి పోషకాలు సరిగా అందుతాయి. దీంతో పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుంది" అని తెలిపారు.

పాఠశాలకు వచ్చిన ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఈ మాత్రలు తీసుకోవాలని ఆమె సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ పెండ్యాల ప్రభాకర్ మాట్లాడుతూ, "విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యం కూడా మాకు ముఖ్యం. ప్రభుత్వం విద్యార్థుల కోసం చేపడుతున్న ప్రతి ఆరోగ్య కార్యక్రమానికి మా పాఠశాల పూర్తి సహకారం అందిస్తుంది. తల్లిదండ్రులు కూడా ఇంట్లో పిల్లలకు పరిశుభ్రత అలవాట్లు నేర్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కుమార్, గద్దం భిక్షపతి, జూపాక పవన్, పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థి, విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం చేతులు శుభ్రంగా కడుక్కోవడం, స్వచ్ఛత ప్రాముఖ్యతపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# కాటన్ బ్యారేజీకి కొత్త ఊపు

**రూ.151 కోట్లతో 117 గేట్ల పునరుద్ధరణకు సీఎం శంకుస్థాపన**

**పిచ్చుకలంక పర్యాటక అభివృద్ధికి జీవో సవరణ కోరిన మంత్రి కందుల దుర్గేష్**




రాజమహేంద్రవరం(ప్రశ్న న్యూస్) ధవళేశ్వరం గోదావరి డెల్టా రైతాంగానికి జీవనాడిగా నిలిచిన ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ఆధునికీకరణకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రూ.151 కోట్ల వ్యయంతో 117 కొత్త గేట్ల ఏర్పాటు పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, గోదావరి డెల్టాను సస్యశ్యామలం చేయాలనే దార్శనికతతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్నారని కొనియాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ ఆలస్యమైందని విమర్శిస్తూ, ఇప్పుడు కూటమి ప్రభుత్వం రూ.151 కోట్లతో 117 గేట్లను కొత్తగా ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, రైతాంగ సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి, రైతులకు అన్నదాత సుఖీభవ పథకం, ధాన్యం కొనుగోళ్లు, ఎన్టీఆర్ భరోసా, దీపం-2.0, స్త్రీశక్తి వంటి సంక్షేమ కార్యక్రమాలు సమర్థంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా పయనిస్తోందన్నారు. పిచ్చుకలంకపై సీఎం దృష్టికి ప్రతిపాదన పర్యాటక శాఖకు సంబంధించిన కీలక అంశాన్ని సభలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన మంత్రి కందుల దుర్గేష్, ధవళేశ్వరం సమీపంలోని పిచ్చుకలంకలో ఉన్న 62 ఎకరాల భూమిని పూర్తిస్థాయిలో పర్యాటక అభివృద్ధికి వినియోగించుకునేలా ప్రస్తుతం అమల్లో ఉన్న జీవోకు సవరణలు చేయాలని కోరారు. ప్రస్తుతం నిబంధనల ప్రకారం 20 శాతం భూమిని మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉందని, పూర్తి భూమిని పర్యాటక శాఖ వినియోగించుకునేలా అనుమతిస్తే గోదావరి ప్రాంతంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశముందని వివరించారు. గోదావరి ప్రాంత అభివృద్ధికి భారీ ప్రాజెక్టును ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి జనసేన పార్టీ తరపున, అధికార కూటమి తరపున మంత్రి కందుల దుర్గేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఆరుద్రోత్సవంలో స్వర్ణరథోత్సవం వైభవం

**శివనామస్మరణతో కదిలిన శ్రీశైలం..**

**లోకకల్యాణం కోసం ప్రత్యేక సంకల్పం**



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీశైలం శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి సోమవారం స్వర్ణరథోత్సవం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు శివనామస్మరణల మధ్య స్వర్ణరథాన్ని లాగుతూ ఉత్సవంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఆరుద్రోత్సవాల్లో భాగంగా వేకువజామున స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వర్ణరథోత్సవానికి ముందు దేశంలో శాంతి, సౌభాగ్యాలు నెలకొనాలని, అతివృష్టి, అనావృష్టి వంటి విపత్తులు నివారించబడాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని ఆలయ అర్చకులు లోకకల్యాణ సంకల్పాన్ని పఠించారు. విశేష పూజల అనంతరం ఉదయం 7.30 గంటలకు గంగాధర మండపం నుంచి ప్రారంభమైన స్వర్ణరథోత్సవం నంది మండపం వరకు భక్తుల హర్షధ్వానాలు, వేదఘోషలు, శివనామస్మరణల మధ్య అంగరంగ వైభవంగా సాగింది. ఉత్సవంలో కోలాటం, తప్పెట చిందులు తదితర జానపద కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి. ఆంజనేయులు, దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ మను చౌదరి**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియలో బిఎల్వోలు నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ వేగవంతం చేయాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి బిఎల్ఓ లకు సూచించారు. సోమవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సుభాష్ నగర్ వార్డు కార్యాలయంలో జరుగుతున్న సర్ ప్రక్రియను జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బి ఎల్ వో లు ఎన్యుమరేషన్ ఫారాలను ఇవ్వడంలోనూ అదే విధంగా పూరించిన ఫారాలను తీసుకోవడంలోనూ పూర్తి బాధ్యతగా వ్యవహరించాలన్నారు ఫారాలు పూరించడంలో ఓటర్ల సందేహాలను నివృత్తి పరుస్తూ వారికి అవగాహన కల్పించాలన్నారు. సర్ ప్రక్రియను వేగవంతం చేస్తూనే తీసుకున్న ఫారాలను వెంటవెంటనే డిజిటలైజ్ చేయించాలని బిఎల్ఓ లను ఆదేశించారు. అందుబాటులో లేని ఓటర్ల వివరాలను సూపర్వైజర్లకు అందించాలని బిఎల్ఓ లను ఆదేశించారు. రోజువారీ టార్గెట్ ను ఏ విధంగా పూర్తి చేయాలో అవసరమైన సలహాలు సూచనలు కలెక్టర్ బిఎల్ఓలకు ఇచ్చారు. అనంతరం కోంపల్లిలో నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ మరియు డిజిటలైజేషన్ ప్రక్రియలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు ఓటర్ల తో నేరుగా మాట్లాడుతూ వారి సందేహాలను నివృత్తి చేస్తూ ఫారాలను ఏ విధంగా పూరించాలనే అంశంపై అవగాహన కల్పించారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ మను చౌదరి**



మేడ్చల్ ( ప్రశ్న న్యూస్ )ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను డిఆర్ఓ మాలతి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి లతో కలిసి అదనపు కలెక్టరు (78) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు వేశారు.. నీళ్లు పోయడం మరిచారు

**- క్యూరింగ్ లేకుండానే సీసీ రోడ్డు పూర్తి చేసిన కాంట్రాక్టర్ - దాదాపు 47 లక్షల పనికి నాణ్యతకు తిలోదకాలు**
**- మల్కాజిగిరి సర్కిల్‌లో ఇంజినీరింగ్ అధికారుల ఇష్టారాజ్యం.? - ప్రజాధనం వృథా చేస్తున్న నిర్లక్ష్యంపై స్థానికుల మండిపాటు**
**- ఎస్టిమేషన్, వర్కర్ పత్రాలను, రిపోర్టర్లకు ప్రజలకు ఇవ్వకూడదా.?**



**మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్)** ప్రజల సౌకర్యం కోసం నిర్మించాల్సిన సీసీ రోడ్లు అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యానికి నిదర్శనంగా మారుతున్నాయనే విమర్శలు మల్కాజిగిరి సర్కిల్‌లో వినిపిస్తున్నాయి. దాదాపు రూ.47 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డుకు కనీస నాణ్యత ప్రమాణాలు పాటించలేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత తప్పనిసరిగా చేయాల్సిన క్యూరింగ్ (నీరు పోయడం) సరిగా చేపట్టకపోవడంతో రోడ్డు మన్నికపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.సీసీ రోడ్డు వేసిన తర్వాత కనీసం కొన్ని రోజుల పాటు నిరంతరం నీరు పోస్తూ క్యూరింగ్ చేయాల్సి ఉంటుంది. దీంతో కాంక్రీటు బలంగా మారి దీర్ఘకాలం మన్నికగా ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం రోడ్డు పూర్తయిన వెంటనే పనులు ముగిసినట్లుగా ఈఈ, డిఈ, ఏఈ, కాంట్రాక్టర్ వదిలేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో భవిష్యత్తులో రోడ్డు పగుళ్లు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అంతేకాకుండా కొత్తగా వేసిన రోడ్డు పై నీరు నిల్వ ఉండేందుకు ఏర్పాటు చేయాల్సిన నీటి కట్టలు కూడా నాణ్యత లేకుండా చిన్నగా నిర్మించారని ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్ భాస్కర్ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి బయట నుంచి మొరం మట్టి తీసుకురాకుండా, రోడ్డు కోసం తవ్విన మట్టినే కట్టలుగా వేసి చేతులు దులుపుకున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో నీరు నిల్వ కాక క్యూరింగ్ ప్రక్రియ పూర్తిగా విఫలమైందని విమర్శిస్తున్నారు.

ఇంకా రోడ్డు రెండు వైపులా వేయాల్సిన సైడ్ బర్మ్(మొరం మట్టి) పనులను కూడా కాంట్రాక్టర్ చేయలేదని, రోడ్డు తవ్విన మట్టిని ఉపయోగించడం పై స్థానికులు మండిపడుతున్నారు. దీనివల్ల పాదాచారులు, వాహనాదారులు అక్కడనుండి వెళ్లలేని పరిస్థితి ఉందని, దానితోపాటు రోడ్డు అంచులు దెబ్బతినే ప్రమాదం ఉందని, వర్షాకాలంలో మరింత నష్టం జరిగే అవకాశం ఉందని అంటున్నారు.

ఇదంతా జరుగుతున్నా మల్కాజ్గిరి సర్కిల్ ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పనుల అంచనా (ఎస్టిమేట్) తయారీలోనే పూర్తి లోపాలు ఉన్నాయని, అవసరమైన అంశాలను పొందపరచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం ఎస్టిమేట్ సరిగ్గా తయారు చేయలేని వారు ఇంజినీరింగ్ అధికారులు ఎలా అవుతారు.? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇంజనీరింగ్ అధికారులు వేసిన ఎస్టిమేషన్ కాపీ, వర్క్ ఆర్డర్ కాపీలను బహిరంగంగా ఉంచాలి, జర్నలిస్టులు, ప్రజలు అడగగానే వాటిని ఇవ్వాలి కానీ మున్సిపల్ శాఖ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగంలో అలా జరగడం లేదు. వాటిని గోప్యంగా ఉంచడంలో అంతర్యం ఏమిటో వాళ్లకే తెలియాలి, అంటే వర్క్ ఆర్డర్ లో ఉన్న విధంగా కాకుండా మరో విధంగా పనులు చేయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్క్ ఇన్స్పెక్టర్, ఏఈ, డీఈ, ఈఈ స్థాయి అధికారులు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని అభిప్రాయపడుతున్నారు. మల్కాజ్గిరి సర్కిల్ పరిధిలో ఇంజనీరింగ్ అధికారులు తమ రాజకీయ పలుకుబడితోఏళ్ల తరబడి ఒకేచోట పాతుకుపోయిన అధికారులపై కూడా స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతున్నాయి. మున్సిపల్ నిబంధనల ప్రకారము బదిలీలు లేకపోవడంతో కొందరు అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నాణ్యతలేని పనులకు అండగా నిలుస్తున్నారని కాంట్రాక్టర్లతో ఆర్థిక ఒప్పందాలు చేసుకున్నారున్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నత అధికారులకు ప్రజల నుంచి ఫిర్యాదులు వెళ్లినా స్పందన లేకపోవడం, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్ల నిర్లక్ష్యం మరింత పెరుగుతోందని మండిపడుతున్నారు.

మల్కాజిగిరి సర్కిల్‌లో ఇంజినీరింగ్ వ్యవస్థ పూర్తిగా గాడితప్పిందనే విమర్శలు ప్రజల నుండి వ్యక్తమవుతున్నాయి. కమిషనర్ల పాలనలో ఫిర్యాదులకు విలువ లేకుండా పోయిందని, నాణ్యతలేని పనులపై విచారణలు జరగడం లేదని, నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వహిస్తున్న అధికారులపై ఎలాంటి చర్యలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. దాదాపు రూ.47 లక్షల ప్రజాధనంతో చేపట్టిన ఈ సీసీ రోడ్డు పనులపై స్వతంత్ర సాంకేతిక విచారణ జరిపి, లోపాలు తేలితే కాంట్రాక్టర్‌తో పాటు బాధ్యులైన ఏఈ, డిఈ, ఈఈ ఇంజినీరింగ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు జోనల్ కమిషనర్ ను, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ ను కోరుతున్నారు.

# హత్యలు..ఆత్మహత్యలు తగ్గేనా.? దేశ చట్ట సవరణ జరిగేనా.?

## దేశవ్యాప్తంగా హత్యలు, ఆత్మహత్యలపై తీవ్ర ఆందోళన

- మహిళలు, చిన్నారులపై నేరాల విషయంలో వేగవంతమైన దర్యాప్తు అవసరమని డిమాండ్
- కుటుంబ వివాదాలు తీవ్రమైన హింసకు దారితీస్తున్నాయని సామాజిక వేత్తల ఆందోళన
- కఠిన చట్టాలతో పాటు వేగవంతమైన న్యాయ ప్రక్రియ కూడా అవసరమని న్యాయ నిపుణుల సూచన
- నేరాలకు పాల్పడిన వారికి శిక్ష తప్పదనే నమ్మకం ఏర్పడాలని విశ్లేషకుల అభిప్రాయం
- పెండింగ్ కేసులను తగ్గించి బాధితులకు త్వరిత న్యాయం అందించాలని డిమాండ్
- మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపు, కుటుంబాల్లో సంభాషణ అవసరమని నిపుణుల సూచన
- నేరాల నియంత్రణకు ప్రభుత్వం, న్యాయవ్యవస్థ, పోలీసు శాఖ, సమాజం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు.




**(గంగి కృష్ణ -- ప్రశ్న న్యూస్ ప్రతినిధి)**

దేశవ్యాప్తంగా రోజురోజుకూ వెలుగులోకి వస్తున్న హత్యలు, కుటుంబ కలహాలతో జరిగే దారుణాలు, మహిళలు, చిన్నారులపై దాడులు, అలాగే పెరుగుతున్న ఆత్మహత్యల ఘటనలు సమాజాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఒకప్పుడు అరుదుగా వినిపించే నేరాలు నేడు దాదాపు ప్రతి రోజూ వార్తల్లో కనిపిస్తుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో దేశంలో చట్టాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలా? న్యాయవ్యవస్థలో సంస్కరణలు అవసరమా..? అనే చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. కొన్ని కుటుంబాల్లో చిన్న చిన్న విభేదాలు తీవ్రమైన విషాదాలకు దారితీస్తున్నాయని సామాజిక పరిశీలకులు పేర్కొంటున్నారు. అయితే ప్రతి ఘటనకు కారణాలు వేర్వేరుగా ఉంటాయని, అన్ని కుటుంబాలను లేదా తల్లిదండ్రులను ఒకేలా చూడడం సరైంది కాదని కూడా నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కోపం, ఆర్థిక ఒత్తిళ్లు, మత్తు పదార్థాల దుర్వినియోగం, మానసిక ఆరోగ్య సమస్యలు, కుటుంబ విభేదాలు వంటి అనేక అంశాలు హింసాత్మక సంఘటనలకు కారణమవుతున్నాయని వారు విశ్లేషిస్తున్నారు.

### న్యాయవ్యవస్థలో మార్పులు అవసరమా..?

న్యాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం, కేవలం చట్టాలను కఠినతరం చేయడం మాత్రమే సరిపోదు. నేరం జరిగిన వెంటనే నాణ్యమైన దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, సాక్షుల రక్షణ, వేగవంతమైన విచారణ, సమయానికి తీర్పులు, శిక్షల అమలు వంటి అంశాలు కూడా సమర్థంగా ఉండాలి. నేరం చేసిన వ్యక్తి తప్పించుకోలేడనే నమ్మకం సమాజంలో పెరిగితేనే నేరాల నియంత్రణలో స్పష్టమైన మార్పు కనిపించే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

### ప్రతిపక్షాలు, మేధావుల అభిప్రాయాలు

ప్రతిపక్షాలు, మేధావులు తీవ్రమైన నేరాల విషయంలో చట్ట అమలును మరింత బలోపేతం చేయాలని కోరుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.
మహిళలు, చిన్నారులు, వృద్ధులపై జరిగే దారుణాలకు సంబంధించి దర్యాప్తు వేగంగా పూర్తి చేసి, న్యాయ ప్రక్రియను ఆలస్యం కాకుండా నిర్వహించాలని వారు సూచిస్తున్నట్లు పేర్కొంటున్నారు.

### కుటుంబ వ్యవస్థపై ఆందోళన

కొన్ని కుటుంబాల్లో కోపాన్ని నియంత్రించుకోలేకపోవడం, సంభాషణ లోపించడం, సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించకుండా హింసకు పాల్పడటం వంటి పరిస్థితులు పెరుగుతున్నాయని సామాజిక వేత్తలు చెబుతున్నారు. కుటుంబ సభ్యులు ఒకరినొకరు వినడం, సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవడం, అవసరమైతే కౌన్సెలింగ్ తీసుకోవడం వంటి చర్యలు మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

### పోలీసు వ్యవస్థ బలోపేతం

నేరాల నియంత్రణలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని భద్రతా నిపుణులు పేర్కొంటున్నారు. సీసీటీవీ వ్యవస్థల విస్తరణ, ఫోరెన్సిక్ ప్రయోగశాలల సామర్థ్యం పెంపు, డిజిటల్ సాక్ష్యాల వినియోగం, ఆధునిక దర్యాప్తు పద్ధతులు అమలు చేస్తే నేరాల ఛేదన మరింత సమర్థవంతంగా ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

### ఆత్మహత్యల నివారణపై దృష్టి

ఆత్మహత్యలు కూడా సమాజానికి తీవ్రమైన సవాలుగా మారుతున్నాయని మానసిక ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, విద్యాసంస్థలు, కార్యాలయాలు మానసిక ఒత్తిడిలో ఉన్నవారిని గుర్తించి సహాయం అందించే వ్యవస్థను బలోపేతం చేయాలని వారు సూచిస్తున్నారు. అవసరమైనప్పుడు నిపుణుల సహాయం తీసుకోవడం ప్రాణాలను కాపాడగలదని గుర్తుచేస్తున్నారు. హత్యలు, ఆత్మహత్యలు, హింసాత్మక ఘటనలు తగ్గాలంటే ఒక్క కఠిన చట్టం సరిపోదు. సమర్థవంతమైన చట్ట అమలు, వేగవంతమైన న్యాయ ప్రక్రియ, నాణ్యమైన దర్యాప్తు, కుటుంబ విలువలు, మానసిక ఆరోగ్యంపై అవగాహన, సమాజంలో పరస్పర గౌరవం ఈ అన్ని అంశాలు కలిసి పనిచేసినప్పుడే శాశ్వత మార్పు సాధ్యమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.
ప్రస్తుతం ప్రజల్లో వినిపిస్తున్న ప్రధాన ప్రశ్న ఒక్కటే "నేరస్థులకు తప్పనిసరిగా, వేగంగా శిక్ష పడే వ్యవస్థ ఏర్పడితేనే సమాజంలో నేరాలు తగ్గుతాయా..?" దీనికి సమాధానం కోసం ప్రభుత్వం, న్యాయవ్యవస్థ, పోలీసు శాఖ, ప్రజలు, కుటుంబాలు అందరూ తమ తమ బాధ్యతను నిర్వర్తించాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు, ప్రతిపక్ష నాయకులు అభిప్రాయపడుతున్నారు.

# ఇక హర్మూజ్ జలసంధిని మేమే నడిపిస్తాం

**- కానీ మాకు డబ్బులివ్వాలన్న ట్రంప్**



న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర పరిణామాలకు దారితీసే విధంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. కీలకమైన హర్మూజ్ జలసంధిని అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటుందని, ఇకపై దాని భద్రతను శాశ్వతంగా పర్యవేక్షిస్తుందని సోమవారం స్పష్టం చేశారు. ఇరాన్ ఒక సైనిక ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఈ వ్యూహాత్మక జలమార్గంలోకి డ్రోన్లను పంపడమే ఇందుకు కారణమని ఆయన ఆరోపించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "మేం హర్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నాం. ఇక వాళ్ల దగ్గర ఏమీ లేదు" అని వ్యాఖ్యానించారు. ఇరాన్‌కు చెందిన సైనిక ఆస్తులే లక్ష్యంగా నిన్న రాత్రి అమెరికా దాడులు చేసిందని, డ్రోన్ల కార్యకలాపాలు కొనసాగితే ఇలాంటి దాడులు మరిన్ని ఉంటాయని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. "నిన్న రాత్రి వారిపై తీవ్రంగా దాడులు చేశాం. వాళ్లు డ్రోన్ పంపిన ప్రతిసారీ మేం గట్టిగా బదులిస్తాం. వారి యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ గన్‌తో సహా చాలా పరికరాలు ధ్వంసమయ్యాయి" అని ట్రంప్ తెలిపారు.ఇరాన్‌తో సుదీర్ఘ చర్చల అనంతరం ఒక ఒప్పందం కుదిరిందని, అయితే చివరి నిమిషంలో ఇరాన్ ప్రతినిధులు మార్పులు కోరడంతో అది విఫలమైందని ట్రంప్ వెల్లడించారు. "మా మధ్య ఒక డీల్ కుదిరింది. 11 గంటల సమావేశం తర్వాత వాళ్లు అన్నింటికీ ఒప్పుకున్నారు. కానీ తర్వాత ఫోన్ చేసి మార్పులు కోరారు. అందుకే మేం ఆ ఒప్పందాన్ని పక్కనపెట్టాం" అని వివరించారు. ఇకపై హర్మూజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికానే తీసుకుంటుందని, అవసరమైతే తామే దాన్ని నడిపిస్తామని ట్రంప్ పేర్కొన్నారు. "ఈ జలసంధికి మేం సంరక్షకులుగా మారతాం" అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఈ భద్రతను ఉచితంగా అందించబోమని, ఈ మార్గం ద్వారా లబ్ధి పొందుతున్న సంపన్న దేశాలు అమెరికాకు అందుకు అయ్యే ఖర్చును చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. "మా సైనికులను ప్రమాదంలోకి నెట్టి భద్రత కల్పిస్తున్నందుకు మాకు డబ్బు చెల్లించాలి" అని ట్రంప్ స్పష్టం చేశారు. పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే హర్మూజ్ జలసంధి, ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైనది. గల్ఫ్ దేశాల నుంచి భారత్ సహా ఇతర ఆసియా దేశాలకు చమురు, గ్యాస్ ఎగుమతులు ఈ మార్గం గుండానే జరుగుతాయి.

# ఏఐ వాడకంలో భారత్ నెం.1

**- ప్రపంచంలోనే మన ఉద్యోగులు టాప్!**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో భారత ఉద్యోగులు ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచారని ఏడీపీ అనే సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది. దేశంలోని 80 శాతం మంది ఉద్యోగులు వారంలో చాలాసార్లు ఏఐని వాడుతుండగా, 41 శాతం మంది ప్రతిరోజూ వినియోగిస్తున్నారని సోమవారం విడుదలైన ఈ రిపోర్ట్ పేర్కొంది. రాబోయే ఏడాదిలో ఏఐ తమ ఉద్యోగ బాధ్యతలపై సానుకూల ప్రభావం చూపుతుందని 31 శాతం మంది ఉద్యోగులు బలమైన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రపంచంలోనే అత్యంత ఆశావాద దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచింది. అయితే, ఆసక్తికరంగా ఏఐని తరచుగా వాడే ఉద్యోగులే తమ ఉత్పాదకతపై సందేహాలు వ్యక్తం చేస్తున్నట్లు నివేదిక తెలిపింది. ఏఐ వాడని వారితో పోలిస్తే, ఏఐ వాడేవారిలో ఒత్తిడి తక్కువగా ఉన్నప్పటికీ ఈ ధోరణి కనిపించడం గమనార్హం.ఈ టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో యువత ముందుంది. 18--39 ఏళ్ల వయసు వారిలో 43 శాతం మంది దాదాపు ప్రతిరోజూ ఏఐని ఉపయోగిస్తున్నారు. అలాగే, పురుషుల (40 శాతం) కంటే మహిళలే (44 శాతం) ఎక్కువగా ఏఐని వాడుతున్నట్టు తేలింది. పెద్ద సంస్థల్లో ఈ వినియోగం మరింత ఎక్కువగా, సుమారు 54 శాతంగా ఉంది. "పనిని సులభతరం చేసే టెక్నాలజీలను స్వీకరించడానికి భారత ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. ప్రపంచంలోని ఇతర ఉద్యోగుల కన్నా వేగంగా ఏఐని అందిపుచ్చుకుంటున్నారు" అని ఏడీపీ ఇండియా, సౌత్‌ఈస్ట్ ఏషియా మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ గోయల్ అన్నారు. కేవలం ఏఐ వాడకాన్ని పెంచడంపైనే కాకుండా, దానిని సమర్థంగా అమలు చేయడం, ఉద్యోగులకు తగిన సాధికారత కల్పించడంపై సంస్థలు దృష్టి పెట్టాలని నివేదిక సూచించింది.

# మాజీ జవాన్‌కు రూ.1.25 కోట్ల పరిహారం

**- సీఆర్పీఎఫ్ తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) విధుల్లో ఉండగా కంటిచూపు కోల్పోయిన ఓ కానిస్టేబుల్‌ను సర్వీస్ నుంచి తొలగించడం చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) తీరును తీవ్రంగా తప్పుబట్టిన న్యాయస్థానం, బాధిత కానిస్టేబుల్‌కు రూ.1.25 కోట్లు పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం, సీఆర్పీఎఫ్ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మసీహ్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఈ తీర్పును వెలువరించింది. సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ (డ్రైవర్)గా పనిచేస్తున్న బలి రామ్, 1996లో విధి నిర్వహణలో ఉండగా కంటిచూపు సమస్యకు గురయ్యారు. దీంతో 1998లో ఆయన్ను వైద్యపరంగా అనర్హుడిగా ప్రకటించి, సర్వీస్ నుంచి తొలగించారు. ఇది 1995 నాటి వికలాంగుల హక్కుల చట్టంలోని సెక్షన్ 47ను ఉల్లంఘించడమేనని కోర్టు తేల్చి చెప్పింది."వికలాంగుల చట్టం ప్రకారం బాధితుడికి ప్రత్యామ్నాయ ఉద్యోగం కల్పించడం తప్పనిసరి విధి, అది అధికారుల విచక్షణ కాదు. బాధితుడి కోసం ఒక కుర్చీని అధికారులే వెతకాలి, అంతేగానీ అతడు వచ్చి ప్రాధేయపడేవరకు ఆగకూడదు" అని ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వ సంస్థ అయిన సీఆర్పీఎఫ్ చట్టపరమైన బాధ్యతను విస్మరించడం ఆశ్చర్యం కలిగిస్తోందని పేర్కొంది. బలి రామ్ దాదాపు మూడు దశాబ్దాలుగా సర్వీస్‌కు దూరంగా ఉండి, ఇప్పటికే పదవీ విరమణ వయసు దాటడంతో తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవడం సాధ్యం కాదని కోర్టు పేర్కొంది. అందువల్ల, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవరిస్తూ, బకాయిపడ్డ జీతభత్యాలు, వడ్డీ, కేసు ఖర్చులతో కలిపి ఏకమొత్తంగా రూ.1.25 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ఎనిమిది వారాల్లోగా ఈ మొత్తాన్ని చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ పరిహారాన్ని బాధితుడు సక్రమంగా పెట్టుబడి పెట్టేందుకు, అతని వైద్య అవసరాలను పర్యవేక్షించేందుకు స్థానిక న్యాయ సేవాధికార సంస్థ సహాయం చేయాలని కూడా సూచించింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588